పరీక్ష చివరి రోజు విషాదం.. కాలువలో మునిగి విద్యార్థి మృతి 7


రాయవరం జడ్పీ హైస్కూల్‌లో టెన్త్ బాలికల వీడ్కోలు సెల్ఫీ

రిలాక్స్!

- ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు
- రేపటి నుంచి పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం

అమలాపురం/ముమ్మిడివరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం జరిగిన పదో తరగతి సోషల్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు జిల్లాలోని 110 పరీక్షా కేంద్రాల్లో 18,945 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 18,836 మంది (99.42 శాతం) పరీక్షలకు హాజరయ్యారు. 109 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వీరిలో 9427 మంది బాలురకుగాను 9363 మంది (99.32 శాతం) హాజరుకాగా 64 మంది గైర్హాజరయ్యారు. అలాగే బాలికలకు సంబంధించి 9518 మందికిగాను 9473 మంది (99.53శాతం) హాజరుకాగా 45 మంది విద్యార్థినులు గైర్హాజరయ్యారు. జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాల్లో డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా, డీవైఈవో జి.సూర్యప్రకాశం ఆరు పరీక్షా కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ ఆరు పరీక్షా కేంద్రాలను, ఎంఈవోలు ఏడు పరీక్షా కేంద్రాలను తనిఖీ నిర్వహించారు. ఎక్కడా మాస్ కాపీయింగ్‌గానీ, మాల్ ప్రాక్టీస్‌గానీ జరగలేదని, పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు డీఈవో సలీంబాషా తెలిపారు. ఎక్కడా సమస్యలు తలెత్తకుండా విజయవంతంగా నిర్వహించడంలో జిల్లాస్థాయి పరిశీలకులు ముప్వా రామలింగం ముఖ్యపాత్ర వహించారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాల ఏర్పాటుతోపాటు 144 సెక్షన్ విధించడం, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంలో అధికారులు చేసిన కృషిని అభినందించారు.

మూల్యాంకనం ఇక మొదలు

అమలాపురం సూర్యనగర్‌లోని జడ్పీ బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం నిర్వహిస్తున్నట్టు డీఈవో సలీంబాషా తెలిపారు. గురువారం నుంచి 9వ తేదీ వరకు మూల్యాంకనం జరుగుతుందన్నారు. వివిధ పాఠశాలల నుంచి చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, ప్రత్యేక సహాయకులుగా నియమితులైన ఉపాధ్యాయులను మూల్యాంకనం నిమిత్తం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, మండల విద్యాశాఖాధికారులు వారిని విధుల నుంచి రిలీవ్ చేయాలని, బుధవారం ఉదయం వీరంతా రిపోర్టు చేయాలని ఆదేశించారు.

జిల్లాలో జూనియర్ కళాశాలలు ప్రారంభం

అమలాపురం టౌన్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జూనియర్ కళాశాలలను మంగళవారం కొత్త విద్యా సంవత్సరంతో ప్రారంభించినట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. ఈనెల 23వ తేదీ వరకు కళాశాలలు పనిచేస్తాయన్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తరగతులను అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇంటర్మీడియట్ విద్యామండలి ఆదేశాల మేరకు వేసవి ఉష్ణోగ్రతలను తట్టుకునే విధంగా విద్యార్థులకోసం వాటర్ బెల్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద తొలిరోజు నుంచి భోజనాలను ఏర్పాటు చేశారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈనెల 23 వరకు తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.



ఏ..రేషన్!

కొత్త రేషన్‌కార్డులకు ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఎప్పుడు ప్రక్రియ ఆరంభిస్తుందా.. ఎప్పుడు దరఖాస్తు చేసుకుందామా అని నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా ఇంకా ప్రక్రియ ప్రారంభించ కపోవడంతో నిరాశ చెందారు. తొలుత సంక్రాంతికి కొత్త కార్డులు పంపిణీ చేసేందుకు నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం ఆ తర్వాత ఆ ఊసే ఎత్తలేదు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 16.20 లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డులు ఉన్నాయి. కొత్త కార్డులు జారీ చేస్తే ఈ సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. మంత్రి నాదెండ్ల మేలో కొత్త కార్డులు జారీ చేస్తామని చెప్పడంతో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

నాలుగేళ్లుగా రేషన్‌కార్డులకు తప్పని నిరీక్షణ

- వైసీపీలో మూడేళ్లూ ఆ ఊసేలేదు
- ప్రస్తుత ప్రభుత్వంలోనూ జాప్యం
- అర్హులైన పేదల ఆందోళన
- ఉమ్మడి జిల్లాలో కార్డులకు క్యూ
- మే నెలలో ఇచ్చేందుకు ప్రణాళిక
- ఇప్పటికే 16.20 లక్షలు
- మరో 3 లక్షల దరఖాస్తులు
- తాజాగా కార్డులకు ఈకేవైసీ
- నెలాఖరు వరకూ గడువు పెంపు

సామర్లకోట, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగేళ్లుగా కొత్త రేషన్‌కార్డులు మంజూరు కావడం లేదు. నాడు వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలి రెండేళ్ల రేషన్‌కార్డుల పేరిట బియ్యం కార్డులు మంజూరు చేసింది. తర్వాత మూడేళ్లలో ఒక్క కార్డూ ఇవ్వలేదు. వైసీపీ హయాంలో దరఖాస్తు చేసుకున్న చాలామంది అర్హులకు కార్డులు రాలేదు. ఆ పార్టీ మద్దతుదారులకు అధికంగా కార్డులు జారీ చేశారన్న విమర్శలు అప్పట్లో వెల్లువెత్తాయి. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడగానే అర్హులు అందరికీ కొత్త కార్డులు మంజూరు చేస్తామని ప్రకటించింది. మొన్న సంక్రాంతికి కార్డులు ఇస్తామని పేర్కొంది. జిల్లా పౌరసరఫరాల అధికారులు కొత్తకార్డులు ఇస్తామని గత డిసెంబరులో ప్రకటించారు. డిసెంబరు 2వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపడతామని, కొత్త రేషన్‌కార్డులే కాదు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో మార్పుల కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కానీ ఆ తర్వాత అది పురోగతి లేకుండా పోయింది.

ప్రభుత్వ పథకాలకు ప్రామాణికం

ప్రభుత్వ పథకాలకు రేషన్‌కార్డులనే ప్రామాణికంగా తీసుకుంటుండడంతో కొత్తకార్డులు కావాలని కోరుతూ జిల్లా, మండల స్థాయిలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజలు పెద్దఎత్తున అర్జీలు సమర్పిస్తున్నారు. మూడేళ్లుగా రేషన్‌కార్డుల్లో చేర్పులు, మార్పులకు అవకాశం ఇవ్వలేదు. దీంతో ఇప్పుడు అనేక మంది అటు తహశీల్దార్ కార్యాలయాలు, ఇటు పౌరసరఫరాల శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కుటుంబంలో ఎవరో ఒకరు చనిపోయి ఉంటే వారి తొలగింపు పుట్టిన వారి పేర్ల చేర్పు, కుటుంబంలో ఐదారుగురు గతంలో కలిసి ఉండి ఇప్పుడు విడిగా ఉన్నవారు కొత్తకార్డుకు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కొత్త రేషన్ కార్డులతోపాటు చేర్పులు, మార్పుల కోసం వస్తున్న అర్జీలు విషయాన్ని జిల్లా అధికారులు ప్రస్తావించారు.

బోగస్ ఏరివేతకే.. ఈకేవైసీ

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 16.20 లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డులు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 6,43,874 కార్డులు, కోనసీమ అంబేడ్కర్ జిల్లాలో 5,37,902 కార్డులు, తూర్పుగోదావరి జిల్లాలో 5,64,994 కార్డులు ఉన్నాయి. మరో 3.30 లక్షల వరకూ కొత్తరేషన్‌కార్డులు మంజూరు చేయాలని ఇప్పటికే నమోదు చేసుకున్న దరఖాస్తుల గణాంక సమాచారం ద్వారా తెలుస్తోంది. రేషన్‌కార్డుల్లో చేర్పులు, మార్పులకు ప్రభుత్వం త్వరలోనే అవకాశం కల్పించనుంది. అందుకు ప్రస్తుతం ఉన్న తెల్లరేషన్ కార్డుదారులకు ఈకేవైసీని చేపట్టింది. దీనివల్ల రేషన్‌లో అక్రమాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. సాధారణంగా కార్డు కలిగిన కుటుంబంలో ఒకరు వేలిముద్ర వేసి ప్రతినెలా రేషన్ తీసుకుంటున్నారు. మిగిలిన సభ్యుల్లో కొందరు చదువులు, ఉద్యోగాల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటుండడంతో అటువంటి వారి వేలిముద్రలు అప్‌డేట్ కాలేదు. దీంతో ప్రస్తుతం తెల్లరేషన్‌కార్డు ఉన్న కుటుంబంలోని అలాంటి సభ్యులందరితో తప్పనిసరిగా ఈకేవైసీ చేయించేలా చర్యలు తీసుకున్నారు. నెలల తరబడి ఈ-పోస్‌లో వేలిముద్రలు వేయని వారు మాత్రమే ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంటుందని పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు. అధిక శాతం ఈకేవైసీకి నోచుకోకపోవడంతో ప్రభుత్వం ఏప్రిల్ నెలాఖరు వరకూ పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది.



మే నెల నుంచి కొత్తకార్డులు?

ఏటీఎం తరహాలో.. మంత్రి ప్రకటన..

ప్రస్తుతం ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నారు. రేషన్‌కార్డుల రేషనలైజేషన్ ప్రక్రియ గతంలోనే పూర్తయింది. 800కు మించి కార్డులున్న రేషన్ షాపులను అధికారులు గుర్తించారు. కొత్త రేషన్ షాపుల ఏర్పాటుకు కార్డుల విభజన ప్రక్రియ చేశారు. గ్రామాల్లో ఒక్కొక్క చౌక దుకాణానికి 400 నుంచి 450 కార్డులు ఉండాలని, మునిసిపాలిటీల పరిధిలో 500 నుంచి 550 కార్డులు ఉండాలని, కార్పొరేషన్ పరిధిలో 600 నుంచి 650 కార్డులు ఉండాలని అధికారులు నిర్ణయించారు. కానీ దీనిపై డీలర్లు కోర్టును ఆశ్రయించి తమకు ఒక్కొక్కరికి 1000 రేషన్‌కార్డులు ఉంటేనే జీవనం సాగించగలమని తెలిపారు. దీంతో కొత్త కార్డుల జారీకి బ్రేక్ పడింది. కోర్టు వ్యవహారం ఇటీవల ముగిసింది. చనిపోయిన వారి కార్డులు తొలగించిన తర్వాత కార్డుల విభజన చేపట్టాలని న్యాయ స్థానం సూచించినట్టు సమాచారం. ఈ క్రమంలో ఈకేవైసీ పూర్తయిన వెంటనే కొత్త కార్డుల జారీ మొదలుకానుందని పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం ప్రకటించారు. ప్రస్తుత రేషన్‌కార్డు సైజు తగ్గించి ఏటీఎం కార్డు తరహాలో మే నెల నుంచి ఇవ్వనున్నట్టు చెప్పారు. ఆ సమయంలోనే కుటుంబ సభ్యుల జోడింపు, తొలగింపు, స్ప్లిట్ కార్డుల కోసం ఆప్షన్లు ఇస్తామని, క్యూఆర్ కోడ్‌తో కొత్త కార్డులు ఇస్తామన్నారు. అయితే కొత్త కార్డులు ఈసారైనా ఇస్తారో లేదో చూడాలి.

ఆముదా.. ఆమోదం!


అమలాపురం పురపాలక సంఘ కార్యాలయం

- అమలాపురం మాస్టర్ ప్లాన్‌కు ప్రభుత్వం ఆమోదముద్ర
- గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రధాన కార్యదర్శి
- అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోలేదంటున్న ప్రజలు

అమలాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ మాస్టర్ ప్లాన్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీనిలో భాగంగా మంగళవారం మాస్టర్ ప్లాన్‌కు సంబంధించిన 45 పేజీల గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విడుదల చేశారు. మాస్టర్ ప్లాన్ ఆమోదానికి సంబంధించి గతంలోనే మున్సిపల్ కౌన్సిల్ క్లియరెన్స్ ఇస్తూ తెలిపిన ఆమోదంతో మాస్టర్ ప్లాన్‌లో ఎటువంటి సవరణ లేకుండా ప్రభుత్వం గతంలో రూపొందించిన ప్లాన్‌కే ఆమోదం తెలిపింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ టౌన్ ప్లానింగ్ ఆధారిత అమలాపురం మాస్టర్ ప్లాన్‌ను మంజూరుచేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు జీవో ఎంఎస్ నంబరు 57తో డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ శాఖ అధికారులు ఆమోద ఉత్తర్వులు జారీ చేశారు. భూవినియోగ మ్యాప్, జోనింగ్ నిబంధనలు, జీవో ఎంఎస్‌నంబరు 66 ప్రకారం ప్రొఫార్మా డేటాను దీంట్లో జత చేశారు. మెట్రోపాలిటిన్ రీజియన్, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీస్ యాక్టు 2016 సెక్షన్ 13 ప్రకారం అముడా రీజియన్‌లోని అమలాపురం పట్టణంలో జోనింగ్ నిబంధనలతోపాటు జీఎస్ఐ ఆధారిత మాస్టర్ ప్లాన్‌ను మంజూరు చేశారు. దీనిలో భాగంగా ఏపీ ల్యాండ్ డెవలప్‌మెంట్ (లేఅవుట్, సబ్‌డివిజన్) రూల్స్ 2015లో జీవో ఎంఎస్ నంబరు 2075 ప్రకారం పట్టణం యొక్క మాస్టర్ ప్లాన్ కాపీని సంబంధిత వ్యక్తులతో పాటు వారి పరిధిలో ఉన్నవారికి తెలియజేస్తూ ఉత్తర్వులిచ్చారు. దీనిలో భాగంగా ల్యాండ్ యూజ్ జోన్ కేటగిరిలో కొన్ని కీలక అంశాలను ప్రస్తావించారు. జోనింగ్ రెగ్యులైజేషన్, సాధారణ నియమావళి, భవనాల నిర్మాణంలో అనుసరించే విధానాలు, రోడ్ల విస్తరణ వంటి అంశాలతో కూడిన ఈ గెజిట్ కాపీని విడుదల చేశారు.


సవరప్పాలెంలో పెన్షన్ల పంపిణీని పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జి అధికారి రవిసుభాష్, కలెక్టర్

జియో ట్యాగింగ్‌తో ఇళ్ల వద్దే పెన్షన్లు

- ప్రజా సంతృప్తే లక్ష్యంగా సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ
- జిల్లా ఇన్‌చార్జి అధికారి రవిసుభాష్

అమలాపురం రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారుల ఇళ్ల వద్దే పెన్షన్ అందించాలనే లక్ష్యంతో జియో ట్యాగింగ్ విధానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని జిల్లా ఇన్‌చార్జి అధికారి పి.రవిసుభాష్ పేర్కొన్నారు. నిరంతర పర్యవేక్షణతో ప్రజా సంతృప్తే లక్ష్యంగా ఎన్టీఆర్ సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. క్షేత్ర స్థాయిలో అవినీతికి, అక్రమాలకు తావు లేకుండా పెన్షన్లు పంపిణీ చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. మంగళవారం అమలాపురం రూరల్ మండల పరిధిలోని నవరప్పాలెంలో ఇంటింటికీ వెళ్లి ఉద్యోగులు సామాజిక భద్రతా పెన్షన్లు అందిస్తున్న తీరును కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఫేషియల్ యాప్‌లో నమోదు, అక్విడెన్స్ స్వీకరణ ప్రక్రియలను ఆయన తనిఖీచేసి పంపిణీపరంగా జరుగుతున్న చిన్నచిన్న లోపాలను గుర్తించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. లబ్ధిదారుల సంతృప్తి స్థాయిలను అడిగి తెలుసుకున్నారు. నూరు శాతం నాణ్యత కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సంతృప్తే కొలమానం గా వివిధ పథకాలను ప్రభుత్వం అమలుచేస్తూ ఐవీఆర్‌ఎస్ తదితర విధానాల ద్వారా లబ్ధిదారుల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా జిల్లాలకు గ్రేడ్‌లు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 2,35,887 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉండగా, వీరికి రూ.100.90 కోట్ల నగదు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. తొలిరోజు వివిధ కారణాలతో ఎవరైనా పెన్షన్ తీసుకోకుండా ఉంటే రెండో రోజు ఆ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుల ఇళ్ల వద్ద నుంచి ఎక్కువ దూరంలో పెన్షన్ పంపిణీ చేయాల్సివస్తే తగిన కారణాన్ని ఎన్టీఆర్ భరోసా మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు.ప్రతీ లబ్ధిదారునికి సీఎం సంక్షిప్త సందేశాన్ని ముందుగా వినిపించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ సాయినాథజైచంద్రగాంధీ, ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు, డీపీఎం ఏపీఎల్ అన్నపూర్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శారీరక వాంఛ ఎరవేసి.. మద్యంలో గడ్డిమందు కలిపి తాగించి సహకార ఉద్యోగి నిలువుదోపిడీ.. మహిళ సహా ఇద్దరి అరెస్టు 7

లొల్లలాకుల ఆధునికీకరణకు రూ.72 కోట్లతో ప్రతిపాదనలు


ఆత్రేయపురం మండలం లొల్లలాకుల వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలోని పదహారు మండలాల పరిధిలో రెండు లక్షల ఆయకట్టుకు సాగునీరందిస్తున్న లొల్లలాకుల వ్యవస్థను రూ.72 కోట్లతో పునః నిర్మించేందుకు విశేష కృషిచేస్తున్నట్టు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. మంగళవారం లొల్లలాకులు వద్ద డిస్ట్రిబ్యూటరీ కమిటీ, సాగునీటి సంఘాలతో సమావేశం నిర్వహించారు. సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సెంట్రల్‌డెల్టా పరిధిలో వ్యవసాయాధారంగా జీవిస్తున్నారని, తద్వారా సాగునీటిపై ఆధారపడి ఉన్నందున లొల్ల లాకులను ఆధునికీకరించడం ద్వారా సెంట్రల్ డెల్టాలోని శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుందన్నారు. ఆధునికీకరణకు సీఎం చంద్రబాబునాయుడు, ఆ శాఖామంత్రి నిమ్మల రామానాయుడులను కలిసి ఇప్పటికే వివరించడం జరిగిందన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు రైతాంగ సమస్యలపై పూర్తి సహకారం అందిస్తున్నారన్నారు. అలాగే కోనసీమలో ఏకో టూరిజం అభివృద్ధి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం సాగునీటి సంఘాల అధ్యక్షులను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఆకుల రామకృష్ణ, చిలువూరి సతీష్‌రాజు, ముదునూరి వెంకటరాజు, ముళ్లపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, బండారు వీరబాబు, చవ్వల జగన్నాథం, మెర్ల గోపాలం, కంటంశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బండారు రూ.5 లక్షల విరాళం..

పర్యాటకులను ఆకర్షిస్తున్న లొల్ల లాకులను పార్కులా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే బండారు అన్నారు. లాకుల వద్ద పచ్చని వనంలా తీర్చిదిద్దేందుకు సంస్థలు, నేతలు, అధికారులు సమన్వయంతో దాతల సహకారం తీసుకుని అభివృద్ధి చేయాలన్నారు. ఇందుకోసం రూ.5 లక్షలు విరాళంగా అందిస్తున్నట్టు ఎమ్మెల్యే ప్రకటించారు.

4 నుంచి స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్లు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): భూముల రిజిస్ట్రేషన్‌ను కొనుగోలుదారులు, అమ్మకందారులు తమకు నచ్చిన సమయంలో రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వీలుగా స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలులోకి తెస్తున్నట్టు జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్ నాగలింగేశ్వరరావు తెలిపారు. అమలాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం స్లాట్ బుకింగ్ విధానంలో సిబ్బంది, దస్తావేజు లేఖర్లకు ఆయన అవగాహన కల్పించారు. ఈనెల 4 నుంచి స్లాట్ బుకింగ్ అమలులోకి వస్తోందని, ప్రతీ రోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు 78 స్లాట్ బుకింగ్‌లు అందుబాటులోకి తేవడం జరుగుతుందని ఆయన తెలియజేశారు.

విందుతో రాజకీయ దుమారం

- తెరపైకి జంటిల్‌మన్ ఒప్పందం.. బొత్స, తోట ఆధ్వర్యంలో మంతనాలు
- ఉప్పలగుప్తం ఎంపీపీ పదవిపై ఊపందుకున్న వ్యూహాలు


దంగేటి జానకి


చిక్కం త్రినాథ

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం మండల ప్రజాపరిషత్ అధ్యక్ష స్థానంపై మళ్లీ రసవత్తర చర్చలు నడుస్తున్నాయి. జంటిల్‌మెన్ ఒప్పందం ప్రకారం ప్రస్తుత ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీ రాంబాబు పదవికి రాజీనామా చేయాల్సి ఉంది. ఉప్పలగుప్తం-1 ఎంపీటీసీ చిక్కం త్రినాథకు ఎంపీపీ పీఠం కట్టబెట్టాలని 2021లో అప్పటి మంత్రి పినిపే విశ్వరూప్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఆ ప్రకారం చల్లపల్లికి చెందిన దంగేటి వీరఅచ్యుతజానకీరాంబాబు మొదటి మూడున్నరేళ్లు, మిగిలినకాలం ఉప్పలగుప్తం-1 ఎంపీటీసీ చిక్కం త్రినాథ ఎంపీపీగా ఉండాలి. 2021 సెప్టెంబరు 24న దంగేటి వీరఅచ్యుతజానకీరాంబాబు ఎంపీపీగా ప్రమాణస్వీకారం చేయగా, ఇప్పుడు మూడున్నరేళ్లు పూర్తవుతుండడంతో త్రినాథకు పదవి అప్పగించాలని వైసీపీలోని కొందరు నాయకులు అంటున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుత ఎంపీపీ భర్త దంగేటి రాంబాబు ముమ్మిడివరం మండలం చెయ్యేరుగున్నేపల్లి సత్తెమ్మ ఆలయం వద్ద మార్చి 26న ఎంపీటీసీలకు విందు ఏర్పాటుచేశారు. దానికి రెండ్రోజుల ముందు రాంబాబు, త్రినాథ వర్గాల మధ్య ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కుదిర్చిన ఒప్పందం ప్రకారం ప్రస్తుత ఎంపీపీ పూర్తికాలం పదవిలో కొనసాగుతారన్న వార్త వైరల్ అయ్యింది. ఇందులో భాగంగానే వైసీపీ ముఖ్య నేతలు, వైసీపీ, జనసేన, టీడీపీ ఎంపీటీసీలను ఎంపీపీ విందుకు ఆహ్వానించినట్టు సమాచారం. ప్రస్తుతం వైసీపీకి 11 ఎంపీటీసీలు, టీడీపీకి ఇద్దరు, టీడీపీలో చేరిన ఒక ఎంపీటీసీ, జనసేనకు ముగ్గురు ఎంపీటీసీలు ఉన్నారు. కూటమికి ఆరుగురు సభ్యుల బలం ఉన్నప్పటికీ ఎంపీపీపై అవిశ్వాసం పెట్టే సత్తా లేదని భావించిన వైసీపీ వ్యూహం ప్రకారం ఎంపీటీసీలకు విందు ఏర్పాటుచేసి సత్తెమ్మ సన్నిధిలో విజయోత్సవం చేసుకున్నట్టు ప్రచారం జరిగింది. ఈ ప్రచారంతో కొందరు ఎంపీటీసీలు అవాక్కయ్యారు. మొక్కుబడి అంటే విందుకు వెళ్లామే తప్ప, మరో కారణం కాదని కూటమి సభ్యులతో సహా వైసీపీలోని మరో వర్గం సభ్యులు చెబుతున్నారు. ఒప్పందాన్ని అతిక్రమించి ఎన్నికలకు వెళ్లిన త్రినాథకు జెంటిల్మన్ ఒప్పందం అమలు ప్రసక్తేలేదని మరొకవర్గం వ్యాఖ్యానిస్తోంది. దీంతో ఈ అంశం పరిష్కారం కోసం మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ రెండు వర్గాలను విడివిడిగా రప్పించుకుని మాట్లాడి అనంతరం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు పరిష్కార బాధ్యతను అప్పగించారని వైసీపీ ముఖ్య నేతలు తెలిపారు.




జాతరలో.. దేవ

సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లిలంకలో మంగళవారం కనకదుర్గమ్మ జాతరలోఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పాల్గొని భక్తులతో కలిసి డ్యాన్స్ చేశారు. కాళికా శక్తి వేషధారులతో కాలు కదిపారు.

- అంతర్వేది


శిక్షణ పొందుతున్న బాలుడు


గుర్రపు స్వారీ చేస్తున్న యువకుడు

ఒకప్పుడు మెగాస్టార్ చిరంజీవి... తర్వాత మగధీరలో రామ్‌చరణ్..... బాహుబలిలో ప్రభాస్... వారిలా గుర్రపుస్వారీ చేయాలనే ఆసక్తి యువతలో పెరుగుతోంది. హార్స్ రైడింగ్ ప్రస్తుతం ట్రెండ్‌గా మారింది. యువతతో పాటు చిన్న పిల్లలు కూడా నేర్చుకునేందుకు శ్రద్ధ కనబరుస్తున్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలకు హార్స్ రైడింగ్‌లో శిక్షణ ఇప్పిస్తున్నారు. వారు గుర్రాలపై స్వారీ చేస్తుంటే చూసి ముచ్చట పడుతున్నారు. యువత, చిన్నారుల తల్లిదండ్రులకు అనుగుణంగా హార్స్ రైడింగ్ ట్రైనింగ్ సెంటర్లు వెలుస్తున్నాయి.

రిహార్స్‌ల్స్

- గుర్రపు స్వారీపై ఆసక్తి కనబరుస్తున్న జనం
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పెరుగుతున్న శిక్షణ కేంద్రాలు
- కాకినాడ బీచ్‌లో దౌడు తీస్తున్న యువకులు, చిన్నారులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు వందకు పైగా గుర్రాలను పెంచుతున్నారంటే గుర్రపు స్వారీ పట్ల యువత ఆసక్తి ఎంటో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కాకినాడ, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లో గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రాలు వెలిశాయి. గతంలో గుర్రపు స్వారీ నేర్చుకోవాలంటే పెద్ద పెద్ద నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఓ మోస్తరు పట్టణాల్లో సైతం శిక్షణ కేంద్రాలు తెరుస్తున్నారు. వేసవి కావడంతో యువతతో పాటు చిన్నారులు కూడా గుర్రపు స్వారీ నేర్చుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అంతేకాదు కార్పొరేట్ స్థాయి ప్రైవేటు స్కూళ్లల్లో సైతం గుర్రపు స్వారీ శిక్షణ ఇప్పిస్తుండడం విశేషం..

ఎన్నో ప్రయోజనాలు...

గుర్రపు స్వారీ నేర్చుకోవడం వల్ల మానసిక, శారీరక సమస్యల నుంచి గట్టెక్కవచ్చు. పోలియో, పక్షవాతంతో పాటు, మెదడు, వెన్నెముక సమస్యలు, వినికిడి లోపాలు... ఇలా అనేక సమస్యలకు చక్కటి చికిత్సగా పని చేస్తుంది. ముఖ్యంగా మానసిక వికాసం లోపించిన పిల్లలకు మంచి ఫలితాలు ఇస్తుందని నిపుణులు చెప్తున్నారు. పిల్లలు గుర్రపు స్వారీ చేయడం వల్ల ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. గుర్రం కళ్లెం పట్టుకోవడం, నిటారుగా కూర్చోవడం, గుర్రాన్ని దుమికించడం, ఒకే రీతిలో ముందుకు సాగడం వంటి చర్యల వల్ల మెదడుకు, శరీరానికి మధ్య సమన్వయం ఏర్పడి మానసిక ఉత్తేజం కలుగుతుంది. ఫలితంగా అనేక రుగ్మతలు వాటంతట అవే తగ్గిపోతాయని చెప్తున్నారు.

ఇసుక నేలైతేనే మేలు...

గుర్రపు స్వారీ ఓ సాహస క్రీడ. ప్రమాదాలకు ఎక్కువ అవకాశాలున్నాయి. అందుకే ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గట్టినేలపై ప్రమాదాలు ఎక్కువ జరిగే అవకాశం ఉండడంతో.. శిక్షకులు ఇసుక నేలల్లో శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతాలు అనుకూలంగా ఉండడంతో ఇక్కడే చాలా మంది తమ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డులోని ఇసుక మేటల మధ్య కొందరు యువకులు గుర్రపు స్వారీ శిక్షణ ఇస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం రెండేసి గంటల చొప్పున నేర్పుతున్నారు. అయితే మూడు నెలల పాటు శిక్షణకు వస్తే.. గుర్రపు స్వారీపై కాస్త పట్టు సాధించవచ్చని చెప్తున్నారు.


స్వారీకి గుర్రాన్ని సిద్ధం చేస్తున్న శిక్షకులు






ఖరీదైన అశ్వంతో అనిల్ రెడ్డి

అశ్వమిత్ర... అనిల్ రెడ్డి



కాకినాడ విద్యుత్ నగర్‌కు చెందిన అనిల్ రెడ్డి జంతు ప్రేమికుడు. పలు జాతుల కుక్కలు, గర్రాలను పెంచి పోషిస్తుంటారు. హార్స్ రైడింగ్‌లో కూడా ఈయన నేర్పరి. ఈయన సుమారు పది వరకు మార్వాడీ జాతి గుర్రాలను పెంచుతున్నారు. అందులో ఏడింటిని వ్యక్తిగత అభిరుచి మేరకు పెంచుకుంటుండగా, మూడింటిని శిక్షణకు వినియోగిస్తున్నారు. ఆయన వద్ద రూ.లక్షన్నర మొదలు రూ.కోటి వరకు విలువైన గుర్రాలు వున్నాయి. వీటిని రాజస్థాన్, పంజాబ్ నుంచి తీసుకొచ్చారు. రెండేళ్లుగా ఇక్కడ శిక్షకులను, గుర్రాల సంరక్షకులను ఉంచి, గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈయన పెంచుతున్న గుర్రాలు రెండుసార్లు ఆల్ ఇండియా చాంపియన్‌షిప్ సాధించాయి.



నేటి సమాజంలో అనేక మంది పిల్లలు ఆటిజం సమస్యను ఎదుర్కొంటున్నారు. దేశం లో ప్రతి 68 మంది పిల్లల్లో ఒక్కరు ఆటిజంతో బాధపడుతున్నారని సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెంట్ ఆటిజం (సీడీసీ) నివేదికలు చెప్తున్నాయి. ఆటిజంపై అవగాహన లేని తల్లిదండ్రులు కొందరు ఉండగా, పిల్లలకు దానిని పెద్ద జబ్బుగా భావించే తల్లిదండ్రులు మరికొందరు ఉన్నారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 2న ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం జరుపుకుంటున్నారు.



ఆటిజం... అధిగమిద్దాం



- ఈ లక్షణాలున్న పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి
- నేడు ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా...

రాయవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జన్యుపరమైన కారణాలతో ఆటిజం వ్యాధి వస్తుంది. పిల్లల మానసిక ఎదుగుదల సరిగ్గా జరగక సాధారణ జీవితం గడపడం కష్టమవుతుంది. మహిళలు గర్భిణీగా ఉన్నప్పుడు తీవ్ర ఉద్వేగాలకు లోనుకావడంతో పాటు ఇన్ఫెక్షన్లకు గురవుతారు. మెదడు ఎదుగుదలకు తోడ్పడే జన్యువులు అందులో స్రవించే సెరటోనిక్, డోపమిన్ వంటి రసాయనాలు తగినంత విడుదల కాకపోవడం, నెలలు నిండకుండా శిశువు పుడితే కూడా ఆటిజానికి గురయ్యే అవకాశాలు ఎక్కువ. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవడం, తల్లిదండ్రులు పిల్లలతో గడపకపోవడం కూడా ఆటిజం సమస్యకు కారణం కావచ్చని వైద్య నిపుణులు చెప్తున్నారు.



లక్షణాలు: సాధారణంగా శిశువులు ఏడాది వయసులో పాకడం, నవ్వడం, నడవడం, ముద్దుముద్దుగా మాట్లాడడం, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల పిలుపునకు బదుల్వివడం వంటివి చేస్తుంటారు. ఆటిజం సమస్య వున్న పిల్లల్లో ఈ లక్షణాలు కనిపించవు. వయసుకు తగ్గట్టుగా మానసిక పరిపక్వత లేకపోవడం, ఎవరితోనూ కలవకుండా ఒంటరిగా ఉండడం, నేరుగా కళ్లల్లోకి చూడలేకపోవడం, మాట్లాడలేక పోవడం, ఇతరులతో కలవడానికి ఇష్టపడకపోవడం, చేసిన పనులనే మళ్లీమళ్లీ చేస్తుండడం, ఎలాంటి అనుభూతి తెలపకపోవడం, శరీరంపై గాయాలైనా తెలుసుకోలేకపోవడం, శబ్ధాలను పట్టించుకోకపోవడం, సరిగా మాట్లాడలేకపోవడం (లేదా) కారణం లేకుండా ఏడవడం, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పిలిచినా పట్టించుకోకపోవడం వంటి లక్షణాలను కలిగి ఉంటారు.

అధిగమించే మార్గాలు: పిల్లల్లో ఆటిజం సమస్యను అధిగమించేందుకు తల్లిదండ్రులు అనేక చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కడుపులో బిడ్డ ఎదుగుదలను వైద్యుల ద్వారా తెలుసుకోవడం, గర్భధారణ సమయంలో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం, వ్యాయామాలు చేయడం, మనోల్లాసంగా ఉండడంతో పాటు తల్లులు నిర్ధిష్టమైన పోషకాలు కలిగిన ఆహారం తీసుకుంటూ వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకోవడం వల్ల ఆటిజం ప్రమాదాన్ని నివారించవచ్చు. గర్భిణులు కొన్ని రకాలైన రోగాలను నియంత్రించేందుకు టీకాలు సైతం తీసుకోవాలి. శిశువు కదలికలకు సంబంధించిన ఏమైనా అనుమానిత లక్షణాలు గమనిస్తే ఆలస్యం చేయకుండా డాక్టర్‌ని సంప్రదించడం ఉత్తమం. ఒకవేళ ఆటిజం బయటపడితే వైద్యుల సలహా మేరకు చికిత్స తీసుకుంటూ మరిన్ని జాగ్రత్తలు పాటించి పిల్లలను కాపాడుకోవచ్చు.

తొందరగా గుర్తిస్తేనే నివారణ సాధ్యం



చిన్న పిల్లల్లో మెదడు ఎదుగుదల లోపంతో ఆటిజం వస్తుంది. వీరిలో చాలా మందికి తెలివితేటలు పూర్తిగా లేకపోవడం, పరస్పర సంభాషణలు సరిగ్గా లేకపోవడం, చెప్పాలనుకున్నది సరిగ్గా చెప్పకపోవడం, భావాలను వ్యక్తం చేయలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తాత, అమ్మ, నాన్న వంటి పదాలను పలికిన కొన్ని రోజులకు పలకడం మానేయడం, వాళ్లలో వాళ్లు ఆడుకోవడం, పిలిచినా పట్టించుకోకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే అను మానించి డాక్టర్‌ను సంప్రదించాలి. పిల్లలు చేసిన పనులు మళ్లీ మళ్లీ చేయడం, ఒకే రకమైన వస్తువులు కావాలని కోరుకోవడం, అధిక కోపం, పిల్లలు వారిని వారు కొట్టుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తే తల్లిదండ్రులు వెంటనే వైద్యుల ను సంప్రదించాలి. చాలా మందిలో అటెన్షన్ డెఫిసిట్ హైపరాక్టివిటీ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ) ఆటిజం కి తేడా తెలుసుకోలేరు. ఏడీహెచ్‌డీ, ఆటిజం ఒకటి కాదు అని తల్లిదండ్రులు గుర్తించాలి. ఏడీహెచ్‌డీకి మందులు ఉన్నా ఆటిజంకు లేవు. ఆరు, ఏడు సంవత్సరాలు వచ్చే వరకు పట్టించుకోకుండా వదిలేస్తే పిల్లల్లో ఆటిజం నివారణ సాధ్యం కాదు. ఎంత తొందరగా గుర్తించి సైకియాట్రిస్టు దగ్గరకు తీసుకువెళ్లి థెరపీ ఇప్పిస్తే అంత మంచిది.

డాక్టర్ వానపల్లి వరప్రసాద్, సైకియాట్రిస్టు. కాకినాడ

అట్టహాసంగా ముగిసిన నాటిక పోటీలు

- మూడోరోజు మూడు నాటికల ప్రదర్శన

రావులపాలెం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సీఆర్సీ కాటన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న 25వ ఉగాది ఆహ్వాన నాటిక పోటీలు మంగళవారం అట్టహసంగా ముగిశాయి. మూడోరోజు నాటిక పోటీలను శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, సీఆర్సీ రూపశిల్పి గొలుగూరి వెంకటరెడ్డి, సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి నల్లమిల్లి వీరరాఘవరెడ్డి, జెడ్పీటీసీ కుడిపూడి శ్రీనివాసరావు, పలివెల త్రిమూర్తులు, హాస్యనటుడు గౌతమ్‌రాజులు ప్రారంభించారు. మూడో రోజు సహృదయ ద్రాణాదుల బాపట్ల వారి వర్క్‌షం హోం ఈనాటికకు దర్శకత్వం డి.మహేంద్ర, నాటకీరణ అద్దెపల్లి భరత్‌కుమార్, రెండో నాటికగా శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి వారి జనరల్ బోగీలు ఈ నాటికకు దర్శకత్వం గోకరాజు విజయ్, రచన పీటీ మాధవ్ వ్యవహరించారు. ప్రత్యేక ప్రదర్శనగా సీఆర్సీ రావులపాలెం వారి అలా ఎలా నాటికను ప్రదర్శించా రు. ఈ నాటికకు కథ రచన డా.విక్టరీ వెంకటరెడ్డి, దర్శకత్వం నాటకీకరణ గంటా రామమోహనరావులు వ్యవహరించారు. రావులపాలెం సీఆర్సీ కళాపరిషత్ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించిన నాటికపోటీలు ప్రేక్షకులను ఆద్యంతం ఆలోచింప చేశాయి. నాటకరంగ కళాకారుల హావభావాలు పాత్రలకు అనుగుణంగా జీవించి నటించడంతో ప్రేక్షకులు నాటిక ప్రారంభ సమయంనుంచి ముగిసేవరకు ఆశక్తిగాతిలకించారు.

వర్క్‌ఫ్రమ్ హోం నాటిక ...

వర్క్ ఫ్రమ్ హోం ప్రవేశపెట్టిన తరువాత వంటరాని మొగుడుతో భార్య అన్ని పనులు చేయిస్తుంది. భర్త ఎదురు తిరిగిన సమయంలో నేను నా పుట్టింటికి వెళ్లిపోతానని బెదిరించి కాలక్షేపం చేస్తుంది. వంటరాని భర్తలను ఇబ్బందులు పె ట్టడం ఫేస్‌బుక్ స్నేహలవల్ల కలిగే నష్టాలను తెలుపుతూ ఈనాటిక సాగింది.

జనరల్ బోగీ నాటిక సారాంశం

ఓడలలోను, విమానాలలోను ప్రయాణం చేయని వారు ఉండవచ్చు ఏమోకానీ రైలులో ప్రయాణం చేయనివారు ఉండరు. సామాన్యుడు జనరల్ బోగిలలో మాత్రమే ప్రయాణించడానికి ఇష్టపడతారు. రైల్వేశాఖ వారు ఈమధ్య జనరల్ బోగీలను తగ్గించారు. జనంతో కికర్కిరిసి ఉంటున్నాయి. కిక్కిరిసిన జనంతో జనరల్ బోగీలలో ప్రయాణించే సమయంలో ఆ రైలుకు ఏదైన ప్రమాదం జరిగితే మరణించిన వారి వివరాలు రైల్వేశాఖవద్ద ఉండవు. జనరల్ బోగీ పెంచడం తోపాటు జనరల్ టిక్కెట్ తీసుకునే ప్రయాణికుల వివరాలు కూడా రైల్వేశాఖ నమో దు చేయాలనే సందేశాత్మకంగా ఈనాటిక సాగింది.





రావులపాలెం సీఆర్సీలో వర్క్‌ఫ్రమ్ హోం నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు, మూడోరోజు నాటిక పోటీలు ప్రారంభిస్తున్న సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం

కిక్ బాక్సింగ్‌లో 'నన్నయ'కు కాంస్య పతకం


కాంస్య పతక విజేతను అభినందిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయ కిక్ బాక్సింగ్ పురుషుల చాంపియన్‌షిప్‌లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల విద్యార్థి బెజవాడ మోహన్‌రాజ్ కాంస్య పతకం సాధించాడని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. విశ్వవిద్యాలయంలో జరిగిన ఉగాది పురస్కారాలలో మోహన్‌రాజ్‌కు పతకాన్ని ప్రదానంచేసి సన్మానించి అభినందించారు. దీనికి సంబంధించిన వివరాలను ఆమె తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని స్వామి వివేకానంద సుభార్తి విశ్వవిద్యాలయంలో జరిగిన అఖిలభారత అంతర్ విశ్వవిద్యాలయాల కిక్ బాక్సింగ్ పురుషుల చాంపియన్‌షిప్‌లో నన్నయ అనుబంధ కళాశాల అయిన అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన మోహన్‌రాజ్ 75 కిలోల కేటగిరీలో కాంస్య పతకం సాధించాడని చెప్పారు. విద్యార్థులందరూ క్రీడలలో రాణించాలని కళాశాలలు, విశ్వవిద్యాలయం అందుకు తగిన ప్రోత్సాహం అందించాలని వీసీ సూచించారు. విద్యార్థి మోహరాజ్‌ను రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, నన్నయ అధికారులు అభినందించారు.

సత్యదేవుడి సన్నిధిలో దస్త్రాలకు పూజ


అనివేటి మండపంలో దస్త్రాలకు పూజ నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): 2025-26ఆర్థిక సంవత్సరానికిగాను దేవస్థానంలో నిర్వహించే ఆర్థికలావాదేవీలు, ఇన్వెంటరీ దస్త్రాలకు సంబంధించి పుస్తకాలకు మంగళవారం అనివేటి మండపంలో పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి,అమ్మవార్లను ఆశీనులు గావించి ప్రత్యేకపూజలు అనంతరం చిట్టా పుస్తకాలను స్వామివారి పాదాలచెంత ఉంచారు. చతుర్వేద పండితులు వేదస్వస్తిఅందజేశారు. ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పాల్గొన్నారు.

గిరిజనుల చేపల పండగ

ఎటపాక, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవిలో గిరిజనులు చేపల వేటను పండగలా నిర్వహిస్తుంటారు. అల్లూరి జిల్లా ఎటపాక మండలం గౌరిదేవిపేట చెరువులో మంగళవారం గిరిజనులు ఉల్లాసంగా ఉత్సాహంగా చేపల వేటను సాగించారు. వేసవిలో తమ గ్రామాల పరిధిలో చెరువుల్లో ప్రతీఏటా గిరిజనులు చేపలవేట సాగిస్తుండడం ఆనవాయితీ. ఈనేపథ్యంలో చెరువులో చేపల వేట కోసం చుట్టుపక్కల గ్రామాలైన కృష్ణవరం, నల్లకుంట, ఎర్రబోరు, గొందిరాజుపేట, చింతలచెరువు, పండువారిగూడెం, కొత్తూరు, పట్టుచీర, కన్నాపురం, తెలంగాణలోని పలు గిరిజన గ్రామాలకు చెందిన గిరిజనులు చేపల వేటను జోరుగా నిర్వహించారు. సంప్రదాయ వలలతో కుటుంబ సభ్యులంతా మూకుమ్మడిగా వేటలో పాల్గొనడం విశేషం. వేటలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ చేపలను పట్టుకుని తీసుకెళ్లారు.


చెరువులో చేపల వేట నిర్వహిస్తున్న గిరిజనులు

రేపు 'తిరుమల'లో అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు శివారున ఉన్న తిరుమల విద్యా సంస్థల్లో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తిరుమల విద్యా సంస్థల ఆధ్వర్యంలో జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్ అండ్ ఎన్ఈఈటీలపై అవగాహన సదస్సు ఉదయం 10 గంటలకు జరుగుతుందని తెలిపారు. తమ పిల్లలు భవిష్యత్‌లో ఐఐటీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి కళాశాలలో విద్యనభ్యసించాలంటే ఎలా సంసిద్ధులు కావాలో ఈ సదస్సులో వివరిస్తారని తెలిపారు. వివరాలకు 7997071672, 7702449686లను సంప్రదించాలని తెలిపారు.

పనస చెట్టు మొదల్లోనే కాయల గుత్తులు

పి.గన్నవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పనసకు సాధారణంగా కొమ్మలతోపాటు కొంత ఎత్తులో చెట్టుకు కాయలు ఉంటాయి. కానీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం శివారు డీఎస్ పాలెంలో పనసచెట్టు మొదల్లో కాయలు గుత్తులుగా కాశాయి. ఆ పనసచెట్టు మొదల్లో 12 కాయలు కాసి చూపరులను అబ్బురపరుస్తోంది.


పనసచెట్టు కింది భాగంలో కాసిన కాయలు

భద్రత ఏది?



- బాలికల పాఠశాలల్లో మహిళా బోధకులే ఉండాలన్న నిబంధనకు ఐటీడీఏల తూట్లు
- అవాంఛనీయ ఘటనలు జరుగుతున్నా దాచిపెడుతున్న వైనం
- అడ్డతీగలలో బాలికల విద్యాలయంలోనే బస చేస్తున్న పురుష సంక్షేమాధికారి
- గిరిజన విద్యాలయాల్లో బాలికలకు సంరక్షణ కరువు

(రంపచోడవరం/అడ్డతీగల-ఆంధ్రజ్యోతి)

గిరిజన విద్యాలయాల్లో బాలికలకు భద్రత కరువైంది. బాలికల పాఠశాలల్లో కచ్చితంగా మహిళా బోధకులు, మహిళా సిబ్బంది మాత్రమే ఉండాలన్న నిబంధనలకు భిన్నంగా రంపచోడవరం మన్యంలోని రెండు ఐటీడీఏల పరిధిలో పురుష బోధకులను కొనసాగిస్తుండటంతో గిరిజన బాలికల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. తరచుగా గిరిజన బాలికలపై లైంగిక వేధింపులు చోటుచేసుకున్న విద్యాలయాలన్నీ పురుష ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులూ ఉన్నవే. రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలో 35 గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలు నడుస్తున్నాయి. వీటిలో కేవలం 7 పాఠశాలలు మాత్రమే పూర్తిగా మహిళా ప్రధానోపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయులతో నడుస్తున్నాయి. పురుష ప్రధానోపాధ్యాయులు, పురుష ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల్లోనే బాలికలపై లైంగిక దాడులు జరుగుతున్నాయి. అయినప్పటికీ ఐటీడీఏ, గిరిజన సంక్షేమ ఉన్నతాధికారులు ఈ లోపాలను సరిదిద్దేందుకు, వాటిని పునరావృతం కాకుండా చూసేందుకు ఎటువంటి చర్యలను చేపట్టడం లేదు. తాజాగా అడ్డతీగల మండలంలో ఓ పాఠశాలలో ఓ ఘటనపై వదంతులు వచ్చాయి. అందుకు సంబంధించి వైద్య పరీక్షలు కూడా జరిగాయి. ఇదిలా ఉండగా ఆ విద్యాలయంలోనే ఓ గిరిజన సంక్షేమ పురుష అధికారి బస చేస్తుండటం కూడా వివాదంగా మారింది. బాలికల విద్యాలయంలోనే నిబంధనలకు విరుద్ధంగా బస చేస్తుండటాన్ని ఎవరూ అడ్డుచెప్పడంలేదు. ఇకనైనా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు చేపడితేనే గిరిజన సంక్షేమానికి సార్థకత.

అమ్మో ఆరుగురా!



ఇదేంటో తెలుసా? టూ వీలర్. ఈ బండిపై ఇద్దరు మాత్రమే ప్రయాణించాలనేది ఒక నిబంధన. సాధారణంగా ఒకే బైక్‌పై ముగ్గురు ప్రయాణించడం చూస్తుంటాం. అయితే అదీ కూడా తప్పే. మరీ రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ రోడ్‌లో ఈ టూ వీలర్‌పై చూశారా... పరిమితికి మించి ఏకంగా ఆరుగురు ప్రయాణిస్తున్నారు. ఏ వాహనమైనా అడ్డొచ్చిందంటే అంతే పరిస్థితి. ప్రమాదాలు చెప్పి రావండోయ్. నిబంధనలు పాటించాల్సిందే. జాగ్రత్తలు తీసుకోవాల్సిందే..

ఫొటోగ్రాఫర్ – రాజమహేంద్రవరం

అన్నప్రసాదం స్వీకరించి ఇంటికి వెళ్తుండగా..

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి



పవన్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

గోపాలపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడు డివైడర్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలంలోని వాదాలకుంట పంచాయతీ పరిధిలో వెదుళ్లకుంట యాద వోలు మధ్యలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా కొయ్యలగుడెం మండలం అంకాలగుడెం గ్రామానికి చెందిన బోడా పవన్‌కుమార్ (20) వెదుళ్ల కుంట గ్రామ శివారులో ఉన్న శ్రీ రేగులమ్మ ఆలయం వద్ద జరిగే అన్నప్రసాద కార్యక్రమానికి హాజరై ప్రసాదాన్ని స్వీకరించిన తరువాత తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో వెదుల్లకుంట, యాదవోలు గ్రామాల మధ్య ఈ ప్రమాదం జరిగింది. పవన్‌కుమార్ తల, ఛాతికి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో గోపాలపురం సామాజిక కేంద్రానికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని దేవరపల్లి ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

తమ్ముడిని హత్య చేసిన అన్న అరెస్ట్

మారేడుమిల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలవరం గ్రామంలో ఆర్థిక లావాదేవీల ఘర్షణలో తమ్ముడిని విల్లంభులతో హత్య చేసిన అన్నను అరెస్ట్ చేసినట్టు మారేడుమిల్లి సీఐ సీహెచ్‌గోపాలకృష్ణ తెలిపారు. గత నెల 23న తమ్ముడి సుగిరెడ్డిని అన్న లచ్చిరెడ్డి రూ.20వేలు అప్పు బాకీ తీర్చలేదనే విషయంలో గొడవ పడి బాణాలతో కొట్టి చంపాడు. ఘటన తరువాత పరారీలో ఉన్నాడగా మంగళవారం నిందితుడిని పట్టుకుని అరెస్ట్ చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

ప్రేమ పేరుతో బెదిరింపులు

పోక్సో కేసు నమోదు

ఆత్రేయపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక 9వ తరగతి చదువుతుంది. ఆమె తల్లి బతుకుతెరువు కోసం గల్ఫ్‌లో ఉండగా తండ్రి కూడా కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదే గ్రామానికి చెందిన గూడపాటి సంపత్ కూమార్ ప్రేమ పేరుతో బాలిక వెంటపడి తనను ప్రేమించకుంటే హని చేస్తానని ఏడాది కాలంగా బెదిరిస్తున్నాడు. బాలిక బంధువుల సాయంతో మంగళవారం ఆత్రేయపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ రాము తెలిపారు.

కోర్టు ఆదేశాలు ధిక్కరించడంపై ఫిర్యాదు

సీతానగరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రఘుదేవపురానికి చెందిన తన్నీరు జయమ్మ కోర్టు ఆదేశాలను ధిక్కరించి ఇల్లు నిర్మాణం కొనసాగిస్తున్నందున స్థానిక ఎస్‌ఐ డి.రామ్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్టు పంచాయతీ కార్యదర్శి జి.జయభార్గవి తెలిపారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రఘుదేవపురం చెరువు గట్టును ఆక్రమించి పాకల్లో నివాసముండేవారని వాటి స్థానంలో జయమ్మ ఇల్లు నిర్మింస్తుండడంతో పక్కనే ఉన్నవారు కోర్టును ఆశ్రయించగా పనులు నిలిపివేయాలని కోర్టు ఆదేశించిందన్నారు. కానీ పనులు కొనసాగించడంతో పంచాయతీ నోటీసులు ఇచ్చినా తీసుకోవడంలేదన్నారు. దీంతో ఫిర్యాదు చేశామన్నారు.

'పది' పరీక్షలు పూర్తి...

స్నేహితులతో స్నానానికి వెళ్లి...

కాలువలో మునిగి విద్యార్థి మృతి

రామచంద్రపురం (ద్రాక్షారామ), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో యువనగర్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి(16) మంగళవారం రామచంద్రపురం మండలం వెల్ల వద్ద కాలువలో మునిగి చనిపోయాడు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక పిల్లా వారి పాఠశాలలో చదువుతున్న విద్యార్థి మంగళవారం పది పరీక్షలు పూర్తికావడంతో స్నేహితులతో కలసి వెల్ల వద్ద కాలువలో స్నానానికి వెళ్లారు. ఇద్దరు మాత్రమే కాలువలోకి దిగారు. ఒకరు కాలువలో మునిగిపోయాడు. మిగిలినవారు ఇంటికి సమాచారం ఇవ్వడంతో కటుంబ సభ్యులు కాలువ వద్దకు చేరుకుని విద్యార్థి మృతదేహాన్ని బయటకుతీశారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు, సమాచారం లేదని ద్రాక్షారామ పోలీసులు తెలిపారు.

ఆ స్థలం మాది.. కాదు మాది!

- ప్రైవేట్ రిసార్ట్ నిర్మాణ స్థలంపై అన్నవరం దేవస్థానం, ఇరిగేషన్ శాఖ మధ్య వివాదం
- పదిరోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఆర్డీవో ఆదేశం



రెండుశాఖల మధ్య వివాదాస్పద స్థల సమస్యపై సర్వేలో పాల్గొన్న ఆర్డీవో, ఇతర అధికారులు

అన్నవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఒకపక్క అన్నవరం దేవస్థానం, మరోపక్క ఇరిగేషన్ శాఖ ఆ స్థలం మాదంటే మాది అని రెండు దశాబ్దాలుగా పోరాటం చేయడం మధ్యలో సర్వే చేపట్టడం తదుపరి సర్వే రిపోర్టు రాకుండానే ఇరు శాఖల అధికారులు మిన్నకుండిపోవడం రివాజుగా మారిపోయింది. వివారాల్లోకి వెళితే అన్నవరం పంపా రిజర్వాయిర్‌ను ఆనుకుని ఒక ప్రయివేట్ రిసార్ట్ నిర్మించారు. ఈ నిర్మాణం దేవస్థానం ఆధీనంలో ఉందని అన్నవరం దేవస్థానం అధికారులు, లేదు ఇరిగేషన్ పరిధిలో ఉందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. దీనిపై మంగళవారం పెద్దాపురం ఆర్డీవో కె రమణి, ల్యాండ్ సర్వే రికార్డు ఏడీ శ్రీనివాసరావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, తహశీల్దార్ తాతారావు, దేవస్థానం అధికారులతో సర్వే చేపట్టారు. వివాదం పూర్వాపరాలు తెలుసుకున్న అనం తరం పదిరోజుల్లో ఆరెంపూడి అన్నవరం, బెండపూడి వరకు సరిహద్దులు నిర్ణయించి నివేదికను ఇవ్వాలని ఆర్డీవో ఆదేశించారు. ఇప్పటివరకు సత్యగిరి నుంచి ప్రారంభమైన సర్వే వివాదాస్పద స్థలం వద్దకు వచ్చేసరికి చల్లబడిపోయేవారు. అయితే తాజాగా వివాదాస్పద స్థలం ఉన్న సర్వే నంబరు 15 నుంచి 24 వరకు సరిహద్దులు నిర్ణయించాలని ఆదేశించడంతో ఈ సమస్య కొలిక్కివస్తుందా లేకుంటే షరామామూలేనా అని దేవస్థానం ఉద్యోగులు, గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. సర్వేలో ల్యాండ్ ప్రొటెక్షన్ అధికారులతో పాటు దేవస్థానం సహాయ కమిషనర్ రామ్మోహన రావు, సూపరెంటెండెంట్‌లు వీవీరమణ, బలువు సత్యశ్రీనివాస్, ఐవీ రామారావు పాల్గొన్నారు.

మాటామాటా కలిపి.. శారీరక వాంఛ ఎర వేసి..

- మద్యంలో మత్తుబిళ్లులు.. గడ్డిమందు కలిపి తాగించి
- సహకార ఉద్యోగిని నిలువు దోపిడీ చేసి పరారైన మహిళ
- మహిళతో పాటు సహకరించిన ఇద్దరి అరెస్టు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఓ రాత్రి వేళ పానీపూరీ బండి వద్ద 60ఏళ్ల సహకార ఉద్యోగితో ఓ మహిళ మాటామాటా కలిపింది. సెక్సువల్‌గా ప్రేరేపించింది. ఓ ఇంటికి తీసుకువచ్చి ఇద్దరు అనుచరులతో మద్యంలో మత్తుబిల్లలు, గడ్డి మందు కలిపి సదరు ఉద్యోగితో తాగించారు. ఆ వ్యక్తి అపస్మారక స్థితికి వెళ్లగానే నిలువు దోపిడీ చేసి పరారయ్యారు. కాకినాడ ప్రైవేటు ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో సదరు ఉద్యోగి వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. ఈ కేసు వివరాలను అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు మంగళవారం రాత్రి విలేకర్లకు వివరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో అద్దెకు ఉంటున్న ఒక వ్యక్తి అల్లవరం మండలంలో ఒక పీఏసీఎస్ సీఈవోగా పనిచేస్తున్నాడు. గత నెల 17వ తేదీన సొసైటీ నుంచి రూ.లక్ష నగదు తీసుకుని అమలాపురం వచ్చాడు. ఆ రోజు రాత్రి 8.30 గంటల సమయంలో మద్యం సేవించి స్థానిక పానీపూరీ బండి వద్దకు వచ్చాడు. అక్కడే పానీపూరీ తింటున్న కాకినాడ మండలం తూరంగికి చెందిన కుమారి (30) పరిచయమైంది. మాటామాటా కలిపింది. అక్కడి నుంచి వారిద్దరు మోటారుసైకిల్‌పై బండారులంక వైపు వెళ్లారు. వారి ఏకాంతానికి సరైన ప్రదేశం లభించలేదు. దాంతో ఆ మహిళ అమలాపురంలో తనకు తెలుసున్న స్నేహితుని ఇల్లు ఉందని చెప్పి నమ్మించింది. ఇద్దరూ కలిసి అమలాపురం నారాయణపేటకు చేరుకున్నారు. ఇందుపల్లి గ్రామానికి చెందిన తుక్కు సుబ్రహ్మణ్యం ఆ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అప్పటికే వారి పథకం ప్రకారం బండారులంక ఎగ్జిబిషన్ వీధికి టి.వెంకటరమణను అక్కడకు రప్పించారు. మద్యం మత్తులో ఉన్న సొసైటీ ఉద్యోగిని జాగ్రత్తగా ఇంట్లోకి తీసుకువెళ్లారు. మద్యంలో తొలుత మత్తు బిల్లలు కలిపి ఇచ్చారు. అప్పటికీ ఉద్యోగి అలాగే ఉండడంతో వెంకటరమణ పథకం ప్రకారం గడ్డి మందును సిద్ధం చేసి ఉంచాడు. తొలుత కూల్‌డ్రింక్‌లో కొద్దిగా గడ్డిమందు కలిపి సహకార ఉద్యోగితో తాగించారు. ఈ తరువాత మద్యంలో గడ్డి మందు కలిపి తాగించడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే వారు ఉద్యోగి జేబులో ఉన్న రూ.లక్ష నగదుతో పాటు అతడి చేతికి ఉన్న బంగారు ఉంగరాన్ని అపహరించుకుని పరారయ్యారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఉద్యోగికి మెలకువ రాగా మోసపోయానని గుర్తించి ఎక్కడ పరువు పోతుందోనని ఎవరికీ ఏమీ చెప్పకుండా ఇంటికి చేరుకున్నాడు. గడ్డి మందు తాగించడంతో అనారోగ్యం పాలవ్వగా ఇంటి వద్దే ఉండి వైద్యం చేయించుకుంటున్నాడు. అంతకంతకు బాధ ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు గత నెల 26న నిలదీశారు. అప్పుడు జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో పట్టణ పోలీసు స్టేషన్‌కు చేరుకుని అదేరోజున ఫిర్యాదు చేశారు. సీఐ వీరబాబు ఆధ్వర్యంలో హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో తూరంగికి చెందిన కుమారితో పాటు ఆమెకు సహకరించిన సుబ్రహ్మణ్యం, వెంకటరమణను మంగళవారం అరెస్టు చేసి వారి నుంచి బంగారు ఉంగరం, రూ.45వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు. వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలిస్తున్నామన్నారు. ఇదిలాఉండగా తీవ్ర అనారోగ్యానికి గురైన సహకార ఉద్యోగి ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వెంటిలేటర్‌పై ప్రాణాపాయ స్థితిలో వైద్యసేవలు పొందుతున్నాడు.

4న అమరావతి చిత్ర కళా వీధి ప్రదర్శన

రాజమహేంద్రవరంలో నిర్వహణ : కలెక్టర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, కమిషనర్



సెంట్రల్ జైలు రోడ్డులో చేస్తున్న ఏర్పాట్లు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన ఈనెల 4న తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు రోడ్డులో ఆర్ట్స్ కాలేజి నుంచి జీజీహెచ్ వరకూ నిర్వహిస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాత్రి ఆమె మున్సిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకుడు ఎం.మల్లికార్జునరావుతో కలసి చిత్రకళా వీధి ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కళాకారుల ప్రతిభకు తగిన గుర్తింపు తీసుకురావడం కోసం రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. సుమారు 500 మందికి పైగా కళాకారులు వస్తున్నట్టు చెప్పారు. రాజమహేంద్రవరంలోని దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీని వీధి ప్రదర్శన ద్వారా వచ్చే నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ప్రదర్శనలో భాగ స్వామ్యం కోరుకునేవారు అమరావతి ఆర్ట్ ఫెస్టివల్.కామ్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని కమిషనర్ కేతన్‌గార్గ్ సూచించారు. ఈ మేరకు ఆర్ట్స్ కళాశాల రోడ్డులో అమరావతి వీధి ప్రదర్శనకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

పింఛన్ సొమ్ముతో సచివాలయ ఉద్యోగి పరారీ

పిఠాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పింఛన్ సొమ్ముతో వార్డు సచివాలయ ఉద్యోగి పరారీ అయ్యాడు. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లుతో పింఛన్ల సొమ్మును లబ్ధిదారులకు అందజేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం పురపాలక సంఘం ఆరవ సచివాలయంలో శానిటేషన్ సెక్రటరీగా పనిచేస్తున్న యర్రా వెంకటరమణ 12,13 వార్డులకు పెన్షన్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం లబ్ధిదారులకు పింఛన్లు అందించేందుకు రూ.1.50లక్షలకు వెంకటరమణకు ఇవ్వగా మరో రూ.32 వేలు వార్డు సచివాలయం అడ్మిన్ వద్ద ఉంచారు. ఉదయమే లబ్ధిదారులకు పింఛన్‌ను ఇవ్వాల్సిన వెంకటరమణ ఇవ్వలేదు. పింఛన్ సొమ్ము రూ.1.50లక్షలతో పరారీ అయినట్లు గుర్తించి మున్సిపల్ కమిషనరు కనకారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 4 నెలల క్రితం ఇదే ఉద్యోగి లబ్ధిదారుల వేలిముద్రలు వేయించుకుని ఫింఛన్ సొమ్ము ఇవ్వకుండా వెళ్లిపోగా, ఉన్నతాధికారుల హెచ్చరికలతో తిరిగి వచ్చి సొమ్ములు అందజేశాడు. ఇప్పుడు విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు కమిషనరు ధ్రువీకరించారు.

ఆసుపత్రి నుంచి పసికందు అపహరణ

పసిబిడ్డతో బస్సులో వెళ్లిపోతున్న మహిళను చింతూరులో పట్టుకున్న పోలీసులు

సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగింత



పసికందుతో వెళ్తున్న మహిళను పట్టుకున్న పోలీసులు

రంపచోడవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఏరియా ఆసుపత్రి నుంచి 5 రోజుల పసికందును గుర్తు తెలియని ఓ మహిళా అపహరించుకుని వెళ్లిపోగా పోలీసులు పట్టుకున్నారు. వివరాల ప్రకారం.. వై.రామవరం మండలం గుర్తేడు సమీపంలోని దుంపవలసకు చెందిన అందాల కళావతి 5రోజుల క్రితం రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో మగ బిడ్డకు ప్రసవించింది. మంగళవారం ఓ మహిళ నర్సుగా చెప్పుకుని తల్లిదండ్రుల వద్దకు వచ్చి ఆ బిడ్డ తక్కువ బరువుతో జన్మించిందని, అత్యవసరంగా బాక్స్‌లో పెట్టాలని కామెర్లు వచ్చాయని వారిని నమ్మించి తీసుకెళ్లింది. కొంతసేపటికి తల్లిదండ్రులు పసిపిల్లల వార్డుకు వెళ్లి చూసుకోగా తమ బిడ్డ అక్కడలేదని గుర్తించారు. వెంటనే ఆసుపత్రి అధికారుల ద్వారా పోలీసు, ఐటీడీఏ, రెవెన్యూ, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తక్షణం రంపచోడవరం డీఎస్పీ ప్రశాంత్ కుమార్ డివిజన్ మొత్తాన్ని అప్రమత్తం చేశారు. ఎక్కడికక్కడ వాహన తనిఖీలు నిర్వహించారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ముమ్మర గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో రంపచోడవరం ఆర్టీసీ బస్‌స్టాండ్ నుంచి ఓ మహిళ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో రాజోలు నుంచి భద్రాచలం వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కిందని సమాచారం తెలియడంతో డీఎస్పీ చింతూరు సబ్ డివిజన్ పోలీసులను అప్రమత్తం చేశారు. బస్సు చింతూరు చేరుకోగానే పోలీసులు చుట్టుముట్టి పసిబిడ్డతో ఉన్న మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఆరా తీయగా ఆ మహిళే పసిబిడ్డను అపహరించిందని గుర్తించారు. అనంతరం స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి ఆ పసిబిడ్డను వైద్యులతో పరీక్షించి మహిళను రంపచోడవరం తరలించారు. ఆ పసికందును తల్లి దండ్రులకు అప్పగించారు. ఈ సంఘటనతో ఆసుపత్రిలో నిర్వహణలోపం,భద్రత తేటతెల్లమైంది.

కేసు నమోదు చేశాం : డీఎస్పీ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

రంపచోడవరం ఏరియా ఆసుపత్రి నుంచి పసికందును అపహరించిన కేసులో కత్తి అశ్విని అనే మహిళను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నామని డీఎస్పీ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. పసికందును తల్లిదండ్రులకు అప్పగించి మీడియాతో మాట్లాడారు. నిందితురాలిని పట్టుకోవడంలో కృషి చేసిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో సీఐలు ఆర్‌జె.రవికుమార్, సీహెచ్ గోపాలకృష్ణ, టి.దుర్గాప్రసాద్, ఎస్‌ఐలు డి.భూషణం, బి.వినోద్, పి.రమేష్, ట్రైనీ ఎస్‌ఐలు ఎస్.గిరిధర్‌బాబు, వి.సుజాత, సురేష్ పాల్గొన్నారు.

విషమంగానే నాగాంజలి పరిస్థితి

ప్రభుత్వ వైద్యుల బృందం వెల్లడి

న్యాయం చేయాలని తల్లిదండ్రుల డిమాండ్



రాజమహేంద్రవరంలో వివరాలు వెల్లడిస్తున్న ప్రభుత్వ వైద్యుల బృందం

రాజమహేంద్రవరం అర్బన్/సిటి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రౌతుగూడెంనకు చెందిన ఎస్.నాగాంజలి(ఫార్మసిస్ట్) ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని ప్రభుత్వ వైద్యుల బృందం వెల్లడించింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో మంగళవారం బోధనాసుపత్రి జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, అనస్థీషియా ఇన్‌ఛార్జి హెచ్‌వోడీ డాక్టర్ అనిల్‌కుమార్, న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సీహెచ్ నీలిమ విలేకర్లతో మాట్లాడారు. నాగాంజలికి రోజురోజుకు ఇన్‌ఫెక్షన్ పెరుగుతున్నదన్నారు. గత నెల 28వ తేదీ నుంచి ఆమె ఆరోగ్యంపై ఫాలో అవుతున్నామన్నారు. బ్రెయిన్‌కు ఆక్సిజన్ తగ్గిపోవడం వల్ల డ్యామేజీ ఎక్కువగా జరిగిందని భావిస్తున్నామన్నారు. పేషెంట్‌ను ప్రస్తుత పరిస్థితుల్లో వేరేచోటకు షిఫ్ట్ చేసే అవకాశం లేదని, ఆరోగ్య పరిస్థితి అంత క్రిటికల్‌గా ఉందన్నారు. బీపీ డౌన్ అవుతోందని, ఫీవర్ పెరుగుతున్నదన్నారు. జాండీస్ కూడా వచ్చిందన్నారు. బొల్లినేని ప్రైవేట్ ఆసుపత్రిలో ట్రీట్‌మెంట్ పూర్తిస్థాయిలో జరుగుతున్నదని పేర్కొన్నారు. ఇలా ఎన్నిరోజులు కండీషన్ ఉంటుందనేది చెప్పలేమని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా వైసీపీ నాయకులు మాజీ ఎంపీ భరత్‌రామ్, యాంకర్ శ్యామల, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కల్యాణి ఆసుపత్రి ఐసీయూలో ఉన్న నాగాంజలిని పరిస్థితిని పరిశీలించారు.అనంతరం డీఎస్పీని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడారు. ఇదే ఆసుపత్రిలో అంజలి ఇంజక్షన్ చేసుకుందని కానీ ఆ దృశ్యాలు రికార్డయిన సీసీ పుటేజీని మాత్రం ఇప్పటి వరకు బాధిత తల్లిదండ్రులకు ఇవ్వలేదన్నారు. సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాగాంజలి తల్లిదండ్రులు మాట్లాడుతూ మా బిడ్డను మాతో ఆరోగ్యంగా పంపాలన్నారు. గత పది రోజులుగా ఎటువంటి మార్పులేదని మా లాంటి పరిస్థితి ఎవ్వరికి రాకుడదన్నారు. మాకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.వసుంధర, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.సుధాకర్, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక నాగాంజలిని పరిశీలించారు.

'కోర్ట్' నటుడికి ఘన స్వాగతం

స్వగ్రామం వచ్చిన రోషన్



కూనవరంలో ర్యాలీగా వస్తున్న రోషన్



కూనవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలై విశేష ఆదరణ పొందిన కోర్ట్ సినిమాలో కీలకపాత్రలో నటించిన రోషన్ స్వగ్రామమైన కూనవరంలో మంగళవారం అడుగుపెట్టడంతో అతని అభిమానులు అడుగడుగున నీరాజనంతో ఘనస్వాగతం పలికారు. రోషన్ పుట్టిన ఊరు కూనవరం. దీంతో రోషన్ సలార్, విరూపాక్ష తదితర సినిమాల్లో నటించాడు. ఇటీవల అగ్రహీరో మెగాస్టార్ చిరంజీవి కోర్ట్ సినిమా బృందాన్ని తన ఇంటికి పిలిపించుకుని అభినందనలు తెలిపిన సంగతి తెలిసిందే. మండలంలో రోషన్ పర్యటించిన సందర్భంగా స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రోషన్ మాట్లాడుతూ తన స్వగ్రామమైన కూనవరంలో ఇంతటి అభిమానం చూపడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అభిమానుల ఆసక్తి మేరకు మరిన్ని చిత్రాల్లో నటించి కూనవరానికి, తన కుటుంబానికి, అభిమానులకు మంచి పేరు తీసుకువస్తానని పేర్కొన్నాడు.

కాంతి కిరణం!

ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. సూర్య కిరణాల ధాటికి ప్రజలు విలవిల్లాడున్నారు. కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో సూర్య కిరణం ఓ కాకి మీద పడుతున్నట్టు కనిపించిన దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించింది.

ఫొటోగ్రాఫర్ - కాకినాడ



రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

అంబాజీపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ కార్పొరేషన్ల రుణాల కోసం లబ్ధిదారులకు ఈనెల3వ తేదీ నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జీవీ సరోవరరావు తెలిపారు. రుణాల కోసం 1,397మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఒరిజనల్ ధ్రువపత్రాలను తీసుకురావాలని సూచించారు.

94శాతం పింఛన్ల పంపిణీ

అల్లవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం సాయంత్రానికి 94శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ తెలిపారు. మొత్తం 9213 పింఛన్లకు 8630 పింఛన్లు పంపిణీ పూర్తి చేశారన్నారు. బోడసకుర్రులో పింఛన్ల పంపిణీలో ఎంపీడీవో కృష్ణమోహన్ పాల్గొన్నారు.

రాజకీయ వేధింపులు అరికట్టాలని ఫీల్డ్అసిస్టెంట్ల ధర్నా


కలెక్టరేట్ ఎదుట క్షేత్ర సహాయకుల ధర్నా

అమలాపురంటౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు అరికట్టాలని డిమాండ్‌చేస్తూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఫీల్డుఅసిస్టెంట్ల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో జిల్లా నలమూలల నుంచి క్షేత్రసహాయకులు హాజరై ధర్నాలో పాల్గొన్నారు. క్షేత్ర సహాయకులపై జరుగుతున్న భౌతికదాడులు అరికట్టాలని, కనీస వేతనచట్టం ప్రకార రూ.26వేలు చెల్లించాలని, బదిలీ సౌకర్యం కల్పించాలని, టార్గెట్ విధానాన్ని రద్దు చేయాలంటూ నినాదాలతో హోరెత్తించారు. యూనియన్ రాష్ట్రఅధ్యక్షుడు ఎం.పరంధామయ్య మాట్లాడుతూ 2006 ఫిబ్రవరి 6 నుంచి ఉపాధి హామీ పథకం ప్రారంభమైందని, అప్పటి నుంచి ఫీల్డు అసిస్టెంట్లుగా పనిచేస్తున్నామని వివరించారు. ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ, సీపీఎం నాయకులు కె.కృష్ణవేణి, కారెం వెంకటేశ్వరరావు, నూకల బలరామ్, గుదే దుర్గాప్రసాద్‌లు సంఘీభావం తెలిపారు. ధర్నాలో ఫీల్డు అసిస్టెంట్ల యూనియన్ కోనసీమ శాఖ అధ్యక్షుడు కె.శ్రీరామ్, వివిధ మండలాల ప్రతినిధులు బి.శ్యామ్, ఆర్.జ్యోతి, ఎ.రమేష్, ఐ.నాగరాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఎం ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పచ్చని కోనసీమలో తాగునీరు, సాగునీరు సమస్యలు ఉండడం అత్యంత దురదృష్టకరమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మంతెన సీతారామ్, ఆంధ్ర మాల్యాద్రి పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కోనసీమ జిల్లా బాధితులతో కలిసి కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. గత నెల 25నుంచి 28వరకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రజాచైతన్య సైకిల్‌యాత్ర నిర్వహించామన్నారు. జిల్లాలోని పలు మండలాల్లో చైతన్య యాత్ర ద్వారా అనేక సమస్యలను ప్రజలు వివరించారని తెలిపారు. గుర్తించిన సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. భూస్వాముల ఆధీనంలో ఉన్న లక్షలాది కొబ్బరిచెట్లను పేదలకు పంచాలని, పేదలందరికీ ఇళ్లు, ఇళ్లస్థలాలు ఇవ్వాలని, ఉపాధి హామీ పనులు కూలీలకు 200రోజులు కల్పించి రూ.600 రోజువారీ వేతనం చెల్లించాలన్నారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు అందించి ఎకరాకు రూ.50వేలు రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓఎన్జీసీ, ఆయిల్ కంపెనీల కాలుష్యాన్ని అరికట్టడంతో పాటు సీఎస్ఆర్ నిధులతో గ్రామాల అభివృద్ధి చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమనస ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మించి వైద్య విద్యను అందించాలని డిమాండ్ చేశారు. కొబ్బరి ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలన్నారు. కోనసీమలో గుర్తించిన సమస్యల పరిష్కారాన్ని కోరుతూ కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గుదే దుర్గాప్రసాద్, నూకల బలరామ్, కె.కృష్ణవేణి, పీతల రామచంద్రరావు, శ్రీరామమూర్తి, భాస్కరరావు, పి.శివ, బీర వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ ఉద్యోగులపై వివక్ష విడనాడాలి


సమావేశమైన షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం నాయకులు

ముమ్మిడివరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయంలో పనిచేస్తున్న ఎస్సీ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్షత చూపుతుందని ముమ్మిడివరంలో సమావేశమైన షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం నాయకులు ఆరోపించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో మంగళవారం మట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ అమరావతిలో పీ-4 కార్యక్రమం ప్రారంభోత్సవానికి సంబంధించి 130 మంది ఎస్సీ ఉద్యోగులకు సెలవు దినాల్లో డ్యూటీలు వేయడం దారుణమన్నారు. ఒకే సామాజికవర్గానికి చెందిన ఉద్యోగులను పీ-4 కార్యక్రమానికి కేటాయించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం జడ్పీ ఉద్యోగులపై వివక్షతను విడనాడాలన్నారు. ఏప్రిల్ 5వ తేదీన డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ జయంతిని, ఏప్రిల్ 11న మహాత్మాజ్యోతీరావుపూలే జయంతిని, ఏప్రిల్ 14 డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో బొజ్జా రమణశ్రీ, ఎం.ఆశీర్వాదం, జనిపల్లి సత్యనారాయణ, కాశి వెంకటాచార్య, జనిపల్లి బాలకృష్ణ, దాసరి వెంకటరమణ, కాశి జగ్జీవన్‌రామ్, నక్కా శ్రీనివాస్, పి.డేనియల్, బుడితి నాగేశ్వరరావు, కాశి అప్పారావు, గోడి శ్రీనివాస్, ఎ.భైరవస్వామి, ఎం.లక్ష్మణకుమార్, ఎస్వీ సత్యనారాయణ, ఎ.శ్రీధర్‌పాల్గొన్నారు.

వేధింపులకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

అమలాపురం టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం పాలతోడు గ్రామంలో పనిచేస్తున్న ఉపాధిహామీ క్షేత్ర సహాయకురాలు తాతపూడి రాజేశ్వరి రాజకీయ వేధింపులకు ఆత్మహత్యయత్నానికి పాల్పడి రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతుందని ఆమె బిడ్డ పైడిమళ్ల రమ్య పేర్కొన్నారు. తన తల్లిపై నిరాధార ఆరోపణలుచేసి విధుల నుంచి తప్పించారని, దానికితోడు ఉద్యోగం నుంచి తొలగించి వేధింపులకు పాల్పడడంతో ఆత్మహత్యయత్నానికి పాల్పడిందని వివరించారు. వేధింపులకు పాల్పడ్డ వ్యక్తులపై చర్యలు తీసుకోవడంతో పాటు తన తల్లి రాజేశ్వరిని ఆరోగ్యం కుదుట పడిన తరువాత విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ మండుటెండలో చంటి బిడ్డతో వచ్చి కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె వినతిపత్రం అందించారు.

సేంద్రియ సాగుతో ఆరోగ్యకర పంటలు

అంబాజీపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతులో సాగు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చునని ప్రకృతి వ్యవసాయ ఏవో శ్రీనివాసరావు అన్నారు. పుల్లేటికుర్రులో సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన సేంద్రియ పీఎండీఎస్ విత్తనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మొదటి విడతగా 12కిలోల వంతున 150కిట్లను రైతులకు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం రైతులకు రూ.900 విలువైన 10కిలోల కిట్లను రైతులకు అందించారు. వీఏఏ పాండు, ఎంటీ జె.నాగమణి, యూనిట్ ఇన్‌చార్జ్ సీహెచ్ శ్యామల, డీఎంఎంటీ ఎన్.శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

'మనోభావాలతో చెలగాటం సహించం'

యానాం, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి):యానాం మెట్టకుర్రు ఆదిఆంధ్రాపేటలో కొలువైఉన్న రామాలయం లోపల టైల్స్ వేసేందుకు కొంత మంది దాతలు ముందుకువచ్చి సహాయం చేస్తే దాన్నికూడా రాజకీయ కక్షసాధింపు కోసం అదేగ్రామంలో ఉన్న కొంతమంది పెద్దలతో ఫిర్యాదుచేయించి అడ్డుకునే ప్రయత్నం చేయడం సరికాదని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. ఇదే అంశంపై యానాం పరిపాలనాధికారితో ఫోన్‌లో మాట్లాడారు. టెండర్లు లేకుండా పనులు మొదలు పెట్టడం హాస్యాస్పందగా ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వర్క ఆర్డర్ లేకుండా పనులు ప్రారంభిస్తే పరిణామాలు వేరేలా ఉంటాయని ఎమ్మెల్యే గొల్లపల్లి హెచ్చరించారు.

శ్మశానానికి స్థలం చూపించి రోడ్డు నిర్మించండి


తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియచేస్తున్న గెద్దాడ గ్రామస్తులు

మామిడికుదురు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): గెద్దాడ గ్రామంలో ప్రజలు అవసరమైన శ్మశాన స్థలాన్ని చూపించి జాతీయ రహదారి పనులు చేసుకోవాలని డిమాండ్‌చేస్తూ గ్రామస్తులు మంగళవారం మామిడికుదురు తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. గత వంద సంవత్సరాలుగా సర్వే నంబరు 42లో 1.38ఎకరాల్లో అంతిమ సంస్కారాలు నిర్వహించుకుంటున్నారని, జాతీయ రహదారుల శాఖవారు సదరు భూమిని సేకరించి రోడ్డు మార్గం ఏర్పాటు చేస్తున్న సందర్భంలో గ్రామస్తులు తమకు శ్మశాన భూమిని కేటాయించాలని అప్పట్లో కోరారు. దానికి విరుద్ధంగా ప్రత్యామ్నాయ శ్మశానభూమిని చూపించకుండా రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారని, దీనిపై శ్మశానభూమిని మినహాయించాల్సిందిగా గ్రామపంచాయతీ తీర్మానం చేశారని పేర్కొన్నారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు ప్రత్యామ్నాయ భూములు చూపించి తదనంతరం 216 జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్‌చేస్తూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కార్యక్రమంలో బత్తుల నాగబాబు, జవ్వాది సత్తిబాబు, నేదూరి శ్రీనివాసరావు, సుంకర నాగభూషణం, ఇంజేటి వెంకటేశ్వరరావు, జిల్లెల్ల శ్రీను, గూటం రాజేష్, కంచి గణపతి, కొనుకు నానాజీ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవాలు

అల్లవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం పంచారామాలయ క్షేత్రం వద్ద ఈనెల5 నుంచి 10వరకు కల్యాణ మహోత్సవాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త, సీనియర్ జర్నలిస్టు నడింపల్లి సీతారామరాజు తెలిపారు. 6నసీతారాముల కల్యాణం, 7న భూసమేత వేంకటేశ్వరుని కల్యాణం జరుగుతుందన్నారు. వీటికి సంబంధించి కల్యాణ ఆహ్వాన పత్రిక మంగళవారం విడుదల చేశారు.

శర్మకు సత్కారం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సైన్స్ పాపులరైజేషన్ అవార్డుకు రాష్ట్రం నుంచి అమలాపురం పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత, కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ ఒక్కరే ఎంపిక కావడం అభినందనీయమని డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి పేర్కొన్నారు. ఈనెల 22న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డు అందుకోనున్న సర్వేశ్వరశర్మను మంగళవారం ఘనంగా సత్కరించారు. సైన్స్ అభివృద్ధికి శర్మ చేస్తున్న కృషిని వక్తలు అభినందించారు. కేవీఆర్ఎస్ నరసింహారావు, కరాటం ప్రవీణ్, కేఎస్‌వీఎస్ మనోహర్, యాలంగి వరప్రసాద్, చోడే జాన్‌పాల్, కె.శ్రావణ్ దిలీప్, డాక్టర్ కె.హేమవిజిత పాల్గొన్నారు.

ఘనంగా భాగిర్తమ్మ తీర్థం

కాట్రేనికోన, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కొత్తపాలెంలో శ్రీభాగిర్తమ్మవారి తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాట్రేనికోనతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అంతకు ముందు మూడు రోజుల పాటు జాతరలు నిర్వహించారు.

పెన్షన్ల పంపిణీ

కాట్రేనికోన, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం వేకువజాము నుంచి ఏప్రిల్ నెల పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అధికారులు పింఛన్లు పంపిణీచేశారు. ఎంపీడీవో వెంకటాచలం, నీటిసంఘం అధ్యక్షుడు వాసంశెట్టి రాజేశ్వరరావు, విత్తనాల బుజ్జి, గుబ్బల చంద్రరావు, మోటుమర్రి సత్యనారాయణమూర్తి, కోటిపల్లి సత్యనారాయణ, విజయకుమార్, బొక్కా శ్రీనివాస్, చిన్నా, సూరిబాబు, మోకా లోవరాజు, ఓలేటి లక్ష్మణ్‌పాల్గొన్నారు.

మట్టి లారీలను అడ్డుకున్న సర్పంచ్, స్థానికులు


ఇరు వర్గాలతో మాట్లాడుతున్న ఎస్ఐ బి.శివకృష్ణ

పి.గన్నవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): గంటి పెదపూడి వంతెనపై మట్టి లారీలు రాకపోకలు సాగిస్తే వంతెన దెబ్బతింటుందని గ్రామ సర్పంచ్ దంగేటి వీరవెంకటసత్యనారాయణతో పాటు పలువురు స్థానికులు లారీలను అడుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈవంతెన మీదుగా నాలుగు గ్రామాల లంక ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని భారీ లోడుతో వస్తున్న మట్టి లారీలతో వంతెన శిథిలమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనుమతులుంటే మట్టి తవ్వుకోండి కానీ వంతెనపై రాకపోకలు సాగించడం కుదరదని తేల్చి చెప్పారు. ఇరు వర్గాల మధ్య మాటలు పెరిగి వాగ్వివాదానికి దిగారు. దీంతో ఎస్ఐ బి.శివకృష్ణ, సిబ్బంది అక్కడకు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. సమస్యలు ఉంటే అధికారులతో మాట్లాడుకోవాలని వారిని వారించారు. వంతెన పటిష్టత విషయంపై తహశీల్దార్ దృష్టికి తీసుకువెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడుకోవాలని ఎస్ఐ కోరారు. అప్పటి వరకు ఆందోళన విరమించాలని కోరారు. దీంతో ఇరు వర్గాలు శాంతించడంతో మట్టి లారీలు రాకపోకలు సాగించాయి. దంగేటి బాబి, ఇందుకూరి రఘు, భూపతిరాజు రాజు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన


డిమాండ్లను ప్రకటిస్తున్న ఫ్యాప్టో చైర్మన్ సుబ్బారావు తదితరులు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించడంతో పాటు 30శాతం మధ్యంతర భృతి చెల్లించాలన్న ప్రధాన డిమాండ్లతో ఫ్యాప్టో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈనెల2న కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టనున్నట్టు ఫ్యాప్టో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి దొరబాబు తెలిపారు. అమలాపురంలోని యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎంటీవీఎస్ సుబ్బారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడంతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. బుధవారం జరిగే నిరసనలో ఫ్యాప్టో ప్రతినిధులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ పెంకే వెంకటేశ్వరరావు, సరిదే సత్యపల్లంరాజు, ఎంఎన్ మునేశ్వరరావు, కార్యదర్శులు షబ్బీర్‌హుస్సేన్, గిడ్డి వీరవెంకటసత్యనారాయణ, అబ్దుల్ రహీం, ఎస్.జ్యోతిబసుపాల్గొన్నారు.

బైలాకు విరుద్ధంగా ఎన్నిక చెల్లదు


అమలాపురంలో ఆర్యవైశ్య సంఘ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రావు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బైలాకు విరుద్ధంగా జిల్లా సంఘాన్ని నియమించడాన్ని వైశ్య సంఘ నాయకులు తప్పుబట్టారు. అమలాపురం శ్రీవాసవి ఫంక్షన్ హాలులో మంగళవారం జిల్లాలోని మండలశాఖల అధ్యక్షుల, కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంఘ అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు (బాబి) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల శాఖలు ఏవిధంగా నిర్ణయిస్తే ఆ విధంగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు బాబి పేర్కొన్నారు. కుసుమంచి పాపారావు మాట్లాడుతూ ఎవరినీ పిలవకుండా జిల్లాలో కొత్త సంఘాన్ని ఏర్పాటు చేసిన తీరును విమర్శించారు. రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు పునరాలోచన చేయకపోతే పోరుబాట పడతామని పలువురు సభ్యులు హెచ్చరించారు. రాష్ట్ర మహాసభ సభ్యత్వం కలిగినవారి ఓట్లతోనే ఎన్నిక నిర్వహించాలని, ఆవిధంగా జరపకపోతే ఆమరణ దీక్ష చేస్తానని సంఘ నాయకుడు వరదా సూరిబాబు హెచ్చరించారు.

సంఘాన్ని విడదీస్తే ఆమరణ దీక్ష చేస్తా : వరదా సూరిబాబు

సమావేశంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు నంబూరి నరేష్, ఉమ్మడి జిల్లా కోశాధికారి కంచర్ల కృష్ణమోహన్, మాజీఅధ్యక్షుడు ప్రగళ్లపాటి కనకరాజు, కొల్లూరి చినబాబు, పల్లపోతు బంగారం, ఉమ్మడి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు యెండూరి సీత, జిల్లా సంఘ నాయకులు సింగంశెట్టి కుమార్, నంబూరి సత్యనారాయణమూర్తి, కాళ్లకూరి కుమార్ పాల్గొన్నారు.

జీడిమెట్లకు సూపర్‌లగ్జరీ సర్వీసు


అమలాపురం రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపో నుంచి హైదరాబాద్‌లోని జీడిమెట్లకు సూపర్‌లగ్జరీ బస్సు సర్వీసును ఈనెల4న ప్రారంభిస్తున్నట్టు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం జీడిమెట్లకు వెళ్లే బస్సు సర్వీసులను నిలుపుదల చేశామన్నారు. 4నుంచి జీడిమెట్లకు ప్రత్యేక బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నామన్నారు. విజయవాడ లక్డీకాపూల్, అమీర్‌పేట, బాలానగర్, చింతల్ మీదుగా జీడిమెట్లకు వెళ్లే విధంగాప్రతీరోజు సాయంత్రం 6 గంటలకు డిపో నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. జీడిమెట్ల నుంచి రాత్రి 8.15గంటలకు బస్సు బయలుదేరి అమలాపురం వస్తుందన్నారు.

శిలువలతో కల్వరి యాత్ర


అమలాపురంలో శిలువలతో కల్వరి యాత్ర నిర్వహిస్తున్న కేథలిక్ క్రైస్తవులు

అమలాపురం టౌన్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): శిలువ మార్గాన్ని ధ్యానిస్తూ మంగళవారం అమలాపురం అమలోద్భవీ మాత్ర పుణ్యక్షేత్రం నుంచి కోనసీమ కల్వరి యాత్ర నిర్వహించారు. అమలాపురం మహిపాలవీధి నుంచి ముమ్మిడివరంగేట్ సెంటర్, నల్లవంతెన, ఎర్రవంతెనల మీదుగా వందలాది మంది కేథలిక్ క్రైస్తవులు శిలువ మార్గాన్ని ధ్యానిస్తూ క్రీస్తు పాటలతో కల్వరి యాత్ర సాగించారు. జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది క్రైస్తవులు ర్యాలీలో పాల్గొన్నారు. అమలోద్భవీ మాత్ర పుణ్యక్షేత్ర విచారణ కర్త ఫాదర్ నాగేతు శౌరికిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కల్వరి యాత్రలో ఏలూరు మెత్రాసన వికార్జనరల్, ఫాదర్ పచ్చిమాల బాల, ఇతర గురువులు దీక్షా పరులు, విశ్వాసులు యాత్రలో పాల్గొన్నారు. 4గంటలు మండుటెండలో కల్వరి యాత్ర సాగింది.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదు : డీఈవో


ఈదరపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం హాజరు పట్టికను పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఈవో సలీంబాషా

అమలాపురం రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా హెచ్చరించారు. మంగళవారం ఇందుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. తరగతి గదిలో విద్యార్థుల విద్యాస్థాయిని ఆయన పరిశీలించారు. 5వ తరగతి విద్యార్థుల ఆంగ్ల పరిజ్ఞానాన్ని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. అసంపూర్తిగా మిగిలిపోయిన బాలికల టాయిలెట్లను పరిశీలించారు. టాయిలెట్ల నిర్మాణం పూర్తి చేయడానికి అవసరమైన నిధులకు అంచనా తయారు చేయించాలని ఇంజనీరింగ్ సిబ్బందికి ఫోన్‌లో సూచించారు. అనంతరం ఈదరపల్లి హెచ్‌డీ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ పాఠశాలలను డీఈవో తనిఖీ చేశారు. ఎన్రోల్‌మెంట్ పెంపుదలకు కృషి చేయాలని, స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని హెచ్ఎంలకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థుల హాజరు నమోదుచేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట సమగ్రశిక్షఅకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు పాల్గొన్నారు.

బీవీసీలో పాలిసెట్ హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థుల కోసం రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటుచేసినట్టు కళాశాల చైర్మన్ బోనం కృష్ణసతీష్ తెలిపారు. ప్రవేశపరీక్ష రాసిన విద్యార్థులు సర్టిఫికెట్ల వెరిఫికేన్, ఆన్‌లైన్ కౌన్సిలింగ్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా అందరికీ అందుబాటులో ఉండేలా పాలిసెట్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే సాంకేతిక విద్యాశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, జిల్లాలోని పాలిసెట్ విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు తెలిపారు.


బాధిత కుటుంబాలకు సాయం అందజేత

ముమ్మిడివరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ కారణాలతో పలువురు మృతిచెందగా ఆ కుటుంబాలకు శ్రీవిశ్వేశ్వరా పెయింటింగ్ యూనియన్ ఆర్థికసాయాన్ని అందించింది. యూనియన్ సభ్యుడైన పంపాని నాగేశ్వరరావు కరోనా కాలంలో మృతిచెందగా వారి కుటుంబానికి సంఘం తరపున రూ.5వేలు అందించారు. అలాగే సంఘ సభ్యులైన కముజు నాగేశ్వరరావు బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందగా ఆ కుటుంబానికి రూ.15వేలు అందించారు. ఇప్పటి వరకు ఎనిమిది కుటుంబాలకు ఆర్థికసాయం అందించినట్టు ఆ సంఘ అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ తెలిపారు. దుగ్గుదుర్తి వెంకటేష్, చింతకింద రామకృష్ణ, లంక చిన్న, గుత్తుల నాగేంద్ర పాల్గొన్నారు.

ఆర్థిక సాయం పంపిణీ

అంతర్వేది, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది దేవస్థానం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న యడ్ల శామ్యూల్‌కు గల్ఫ్ గృహకార్మికుల హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. మంగళవారం జిల్లెల్ల జయరాజు కుమార్తె అభినయ పుట్టినరోజు సందర్భంగా అనేక ఆశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలతో పాటు రూ.12,500 సాయంగా అందించారు. కార్యక్రమంలో నల్లి డేవిడ్, నవోదయ ఎలక్ట్రికల్, ప్లంబింగ్ యూనియన్ అధ్యక్షుడు రాపాక చిన్నీ, ఎస్సీసెల్ అధికార ప్రతినిధి తాడి మోహన్‌బాబు, అరుణోదయ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నల్లి ప్రసాదరావు పాల్గొన్నారు.

రేపు గ్రామదేవత మహాలక్ష్మమ్మ విగ్రహ ప్రతిష్ఠ


మల్లాడి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

యానాం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): యానాం కొత్తపేట గ్రామంలో శ్రీమహాలక్ష్మమ్మ అమ్మవారి నూతన ఆలయంలో ఈనెల3న విగ్రహ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవాన్ని గ్రామస్తులు నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం మంగళవాయిద్యాలు, వేదమంత్రాలతో ప్రదక్షిణ ప్రతిష్ఠా సంకల్పం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వాచనం, పంచగవ్యం, దీక్షాధారణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, సతీమణి ఉదయలక్ష్మీ దంపతులు పాల్గొని పుజలు నిర్వహించారు. గ్రామపెద్దలు, కమిటీ ప్రతినిధులు మల్లాడి కృష్ణారావు దంపతులను, మల్లాడి శామ్యూల్‌ను సత్కరించారు. యానాం మెట్టకుర్రు వంశీకృష్ణా కాలనీలో కొలువైఉన్న నేరేళ్లమ్మ జాతర మహోత్సవాన్ని గ్రామస్తులు నిర్వహించారు. ఆలయం వద్ద విశేష పూజలు నిర్వహించారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అమ్మవారిని దర్శించి విశేష పూజలు చేపట్టారు.

'వక్ఫ్ సవరణ బిల్లును టీడీపీ వ్యతిరేకించాలి'

మామిడికుదురు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న వక్ఫ్ సవరణ బిల్లును తెలుగుదేశం పార్టీ వ్యతిరేకించాలని ఆంధ్రప్రదేశ్ షియా ఉల్మా బోర్డు అధ్యక్షుడు మౌలానా అబ్బాస్ బాకరీ కోరారు. సీఎం చంద్రబాబు ఏప్రిల్ 3న పార్లమెంటులో ప్రవేశపెట్టే సవరణ బిల్లును వ్యతిరేకించాలని సూచించారు. ఈబిల్లును సవరణచేస్తే ముస్లిం మత స్వేచ్ఛ, స్వయం ప్రతిపత్తిపై బహిరంగ దాడి అన్నారు. ఈబిల్లులో వక్ఫ్ బోర్డులు, మండలిలలో ముస్లిమేతరులకు ప్రాతినిధ్యం కల్పించే నిబంధన ఉందని, ఇది ముస్లిం మత సంస్థల నిర్వహణలో వారి స్వయం ప్రతిపత్తిని బలహీనపరిచే ప్రయత్నమే అన్నారు. ఆయా అంశాల ఆధారంగా షియా ఉల్మా బోర్డు ఈబిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తుందని, కావున టీడీపీ ఈబిల్లును పార్లమెంటులో వ్యతిరేకించాలని కోరారు.

విద్యార్థినుల వీడియోపై సీఎండీ పృథ్వీతేజ్ అభినందన

పి.గన్నవరం, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): కె.ఏనుగుపల్లి హైస్కూల్ 8వ తరగతి విద్యార్థులు నలుగురు విద్యుత్ వనరులు పొదుపుగా వాడుకోవాలని కోరుతూ జనవరిలో వీడియో ద్వారా అవగాహన కల్పించారు. అప్పట్లో ఈవీడియోను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చూసి విద్యార్థులు అడబాల రామచంద్రిక, గుర్రం శ్రావణి, పుచ్చకాయల కావ్యశ్రీ, గుడాల దర్శినిలను అభినందించారు. ఈవిషయం ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ దృష్టికి వెళ్లడంతో వారిని అభినంధించి సత్కరించాలని జిల్లా స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రాజబాబు నలుగురు విద్యార్థులకు అమలాపురంలో ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందించి సత్కరించారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుడు సీహెచ్ గోపాలరావు, విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పి.గన్నవరం, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరంలో జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనుల్లోభాగంగా 33కేవీ లైన్‌లో పోల్స్‌కండక్టర్ మార్పు చేసేందుకు మండల ప్రధాన కేంద్రం ఫీడర్, నాగుల్లంక ఫీడర్లలో ఉదయం 10నుంచి 4గంటలు వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని అమలాపురం ఏఈ కె.రాంబాబు, ఆపరేషన్ ఏఈ జీవీ ఆచార్యులు తెలిపారు.

'వర్గీకరణను అడ్డుకుంటే జగన్ మూల్యం చెల్లించుకోవాల్సిందే'

ఐ.పోలవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటే మాజీ సీఎం జగన్ మూల్యం చెల్లించుకోక తప్పదని ఎమ్మార్పీఎస్ నాయకులు హెచ్చరించారు. మంగళవారం మురమళ్లలో ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశమయ్యారు. శాసనమండలిలో ఎస్సీ వర్గీకరణను జగన్ అడ్డుకోవడం వల్లే ఆర్డినెన్స్ తీసుకురావలసి వచ్చిందన్నారు. వర్గీకరణను అడ్డుకుని మరోసారి జగన్ మాదిగల రాజకీయ శత్రువుగా మారాడని వ్యాఖ్యానించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి, ఉపాధ్యక్షుడు వీధి చిరంజీవిమాదిగ, ఖండవెల్లి ఏలియా, ఇందుర్తి కిశోర్, ముమ్మిడివరపు మన్యం, ఇందుర్తి ప్రకాశ్, కొమానపల్లి చిన్న, ఇందుర్తి శ్రీను, కొమానపల్లి సుబ్రహ్మణ్యం, సవరపు వెంకట్, వీధి వెంకటేశ్వరరావు, వీధి వెంకన్న, వీధి ప్రేమానందం పాల్గొన్నారు.

ఓఎన్జీసీ బావిలో ప్రెషర్ టెస్టింగ్

అల్లవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలం గుండ్రోతువారి మెరకలో ఓఎన్జీసీ బావిలో మంగళవారం ప్రెషర్ టెస్టింగ్ నిర్వహించారు. నాణ్యతతో కూడిన ఉత్పత్తులు సాధించేందుకు ఈఆన్‌షోర్ బావిలో ప్రెషర్ టెస్టింగ్‌లు నిర్వహించారు.

అట్టహాసంగా అంబేడ్కర్ జయంత్యుత్సవాలు ప్రారంభం

రాజోలు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాలు రాజోలులో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా రాజోలు అంబేడ్కర్ సామాజిక భవనంలో రాజోలు నియోజకవర్గ అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని సర్పంచ్ రేవు జ్యోతి, డాక్టర్ రాపాక రమేష్‌బాబు, తెన్నేటి కిశోర్ ప్రారంభించారు. దళిత చైతన్యవేదిక ఉపాధ్యక్షుడు చిలకపాటి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దళితచైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏప్రిల్ 14న జరిగే అంబేడ్కర్ జయంత్యుత్సవాలను మంగళవారం నుంచి ప్రారంభించామన్నారు. అనంతరం బుద్దాల బ్లడ్ బ్యాంకుకు 50మంది యువకులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకులను మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, దేవ రాజేంద్రప్రసాద్, సరెళ్ల విజయప్రసాద్ అభినందించారు. జేఏసీ రాజోలు మండల అధ్యక్షుడు మట్ట సురేష్‌కుమార్, పులపకూర లిలినీఆశారాణి, తాడి సహదేవుడు, నేతల నాని, కుసుమ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మండపేట

రామును సత్కరించిన జీవీరావు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కళారత్న అవార్డు గ్రహీత గొర్రెల రామును మంగళవారం మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జీవీ రావు సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డు లు పొందాలని ఆయన అభిలషించారు. ఆయన్ను సత్కరించి వెంకటేశ్వర స్వామి ప్రతిమను అందచేశారు.

రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

అంబాజీపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ కార్పొరేషన్ల రుణాల కోసం లబ్ధిదారులకు ఈనెల3వ తేదీ నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జీవీ సరోవరరావు తెలిపారు. రుణాల కోసం 1,397మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఒరిజనల్ ధ్రువపత్రాలను తీసుకురావాలని సూచించారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి ఒక్కరోజు ఆదాయం రూ.2.30లక్షలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,30,300 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి అమలాపురానికి చెందిన స్వామినాయుడు శిరిష, దంపతులు రూ.1,11,600 విరాళం ఇవ్వగా, దాతలకు స్వామివారి చిత్రపటం అందచేశారు. ఆలయంలోని మాడ వీధుల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను ఉపకమిషనరు పరిశీలించారు. ఫ్లై ఓవర్‌పై గ్రీన్‌మ్యాట్ పనులను ఇంజనీరింగ్ బృందంతో పర్యవేక్షించారు.

నేటి నుంచి కేశవస్వామి దీక్షలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో బుధవారం నుంచి కేశవస్వామి దీక్షలు చేపడుతున్నట్లు ఆలయ ఈవో బీహెచ్వీ రమణమూర్తి తెలిపారు. ఈ నెల 6న స్వామివారి వార్షిక కల్యాణం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 135 మంది కేశవ దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పద కొండు రోజులపాటు చేపట్టే దీక్షకు నూతన దుస్తులు, మాలలు, వసతి, భోజనం అల్పాహారం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.



ర్యాలి కేశవస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

దంగేరులో ఇంటింటి సర్వే

కె.గంగవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని దంగేరు గ్రామంలో డెంగీ కేసు నమోదవడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. మంగళవారం మలేరియా జిల్లా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు దంగేరు గ్రామంలో పర్యటించారు. గ్రామానికి చెందిన మోర్త రాజు జీవనోపాధి కోసం వైజాగ్‌లో ఉంటున్నాడు. అక్కడ జ్వరం రావడంతో దంగేరు వచ్చాడు. అతనికి డెంగీ సోకినట్లు పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. దీంతో అప్రమత్తమైన అధికారులు గ్రామంలో ఇంటింట సర్వే చేశారు. జ్వరాల కేసులు నమోదు చేశారు. మలేరియా జిల్లా అధికారి ఇంటింటి సర్వేను పర్యవేక్షించి పారిశుధ్యం మెరుగునకు పలు సూచనలు చేశారు. డాక్టర్ కేథరిన్, ఆమని, వైద్య సిబ్బందికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.



దంగేరులో ఇంటింటి సర్వే జరుపుతున్న వైద్య సిబ్బంది

ఘనంగా పోలేరమ్మ జాతర

కె.గంగవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూళ్ల శివారు నరజాడ గ్రామ దేవత పోలేరమ్మ జాతర సోమవారం రాత్రి జరిగింది. జాతర సందర్భంగా కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం రాత్రి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించగా విజేతలకు మంత్రి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంకే గోవింద రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న మంత్రి సుభాష్

సత్యనారాయణ సేవలు అభినందనీయం

కె.గంగవరం, ఏప్రిల్ 1(ఆంధ్ర జ్యోతి): అముజూరు సొసైటీలో వివిధ హోదాల్లో పనిచేసి సీఈవోగా ఉద్యోగ విరమణ చేస్తున్న సత్య నారాయణ సేవలు అభినందనీయమని కూళ్ల నీటి సంఘం అధ్యక్షుడు ఎనుముల గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం సొసైటీ కార్యాలయం ఆవరణలో ఆయన ఉద్యోగ విరమణ సభ జరిగింది. దీనికి సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జ్ వి.జవహర్ అధ్యక్షత వహించారు. సర్పంచ్ నానావరపు కల్యాణి, కూటమి నాయకులు దామినేని శ్రీనివాసు, చిట్టూరి సుబ్బారావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాసరావు (చిన్ని), నియోజకవర్గంలోని పలు సొసైటీల నుంచి వచ్చిన సిబ్బంది సత్యనారాయణ సేవలను కొనియాడారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. కుందూరు ఆసుపత్రిలో సీహెచ్‌వో గా పనిచేస్తున్న ఎం.లక్ష్మి మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆసుపత్రి వైద్యులు రత్నసుధ, సిబ్బంది సీహెచ్ సూర్యారావు, డీఎస్ మూర్తి, టీఎస్ఆర్ మూర్తి, రాముడు, పార్వతి, సుబ్రహ్మణ్యం, విజయగోపాల్ తదితరులు సన్మానించారు.



మాట్లాడుతున్న నీటి సంఘం అధ్యక్షుడు గోపాలకృష్ణ

గారపాటి సేవలు అభినందనీయం

ఆలమూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా గారపాటి శ్రీనివాస్‌చౌదరి సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ అన్నారు. ఆత్రేయపురం లొల్లలాకుల వద్ద జరిగిన ఇరిగేషన్ సమావేశంలో కాలువల ద్వారా సాగునీరు అందించడానికి చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి చేస్తున్న సేవలను ప్రసంశనీయమని వారన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు సత్కరించారు.



గారపాటిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఏసీ గదుల్లో కూర్చుంటే సమస్యలు తీరవు

అధికారులకు ఎమ్మెల్యే వేగుళ్ల చురకలు

మండపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు ఏసీల్లో కూర్చుని విధులు నిర్వహిస్తే ప్రజల సమస్యలు పరిష్కారం కావని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అధికారులకు చురకలు వేశారు. గొల్లపుంతలో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించే వరకు టెంట్‌లో కూర్చుని పాలన సాగించాలని ఆయన కమిషనర్ రంగారావును ఆదేశించారు. మండపేట 20వ వార్డులో వున్న టిడ్కో గృహాల సముదాయం వద్ద మంగళవారం ఎమ్మెల్యే టిడ్కో, మున్సిపల్ విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు టిడ్కో గృహాలను ఎంత మంది లబ్ధిదారులకు అప్పగించారని ప్రశ్నించారు? బ్యాంకు రుణాలు లబ్ధిదారులకు ఎంత మేరకు ఇచ్చారు అనే అంశాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అపార్ట్‌మెంట్ వద్ద సంబంధిత బ్లాక్ వివరం, అధికారి ఫోన్ నెంబరు ఏర్పాటు చేయాలని ఆయన అదేశించారు. టిడ్కో సముదాయంలో ఇళ్లను లబ్ధిదారులకు అందించటంతో పాటు సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పరిపాలన ఇక్కడ నుంచే సాగించాలని కమిషనర్‌ను అదేశించారు. లబ్ధిదారులు ఇక్కడికి రాకుంటే వారి ఇళ్లను రద్దు చేసి దాని జాబితాను కలెక్టర్‌కు సమర్పించాలని వేగుళ్ల తెలిపారు. కాలనీలోని లబ్ధిదారుల సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట కమిషనర్ రంగారావు, మున్సిపల్ ఏఈ పవన్, టిడ్కో ఏఈ వివేక్, మెప్మా సీఎంఎం పి.సుజాత, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల



లొల్లలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ప్రతినెలా విధిగా పింఛన్ల పంపిణీ

కొత్తపేట ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వృద్ధులకు, వితంతులకు ప్రతినెలా ఒకటిన విధిగా పించన్లు పంపిణీ చేస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. మంగళవారం లొల్ల గ్రామంలో పింఛన్లు పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ప్రజలు అవసరాలకు అనుగుణంగా పని చేయడమే చంద్రన్న ధ్యేయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.జగన్నాథం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభం

రాయవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం ఏడాది ముందుగానే తరగతులు నిర్వహించాలని నిర్ణయించడంతో ఏప్రిల్ 1 నుంచి జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాల్లో ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ఎం.రామారావు తెలిపారు. ఏప్రిల్ 24 నుంచి జూన్ 1వరకు వేసవి సెలవులు ఉంటాయి. జూన్ 2న కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి. రాయవరం జూనియర్ కళాశాలలో ఉదయం టెన్త్ పబ్లిక్ పరీక్ష నిర్వహించడంతో మధ్యాహ్నం నుంచి తరగుతులు ప్రారంబించారు. నేటి నుంచి ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 వరకు తరగతులు నిర్వహించనున్నారు.

నూతన పింఛన్ల అందజేత

మండపేట ఏప్రిల్, 1(ఆంధ్రజ్యోతి): అర్తమూరులో నూతనంగా మంజూరైన నాలుగు పింఛన్‌లను ఉప సర్పంచ్ కర్రి సత్యనారాయణరెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎన్.వీరెడ్డి, పి.సుబ్బారెడ్డి మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.



రిలే దీక్షలకు సంఘీభావం ప్రకటించిన ఎమ్మెల్సీ తోట

'ఇళ్ల మధ్య మద్యం దుకాణమా'?

మండపేట ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఇళ్ల మధ్య మద్యం దుకాణాలు ఏమిటని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు విమర్శించారు. సప్తగిరి థియేటర్ సమీపంలో ఏర్పాటు చేసే మద్యం దుకాణాన్ని వ్యతిరేకిస్తూ మూడు వార్డుల ప్రజలు చేస్తున్న రిలే నిరాహారదీక్ష శిబిరాన్ని ఆయన మంగళవారం సందర్శించి మద్దతును తెలిపారు. ఆయన వెంట స్థానిక నేతలు ఎం.మురళి, షేక్‌అలీఖాన్‌బాబా, పి.సత్తిబాబు, మారిశెట్టి సత్యన్నారాయణ, యరమాటి వెంకన్నబాబు తదితరులు వున్నారు.

మద్యం దుకాణ ప్రాంతం పరిశీలన

మండపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండపేట సత్యశ్రీ రోడ్డులో మద్యం దుకాణం ఏర్పాటుకు వ్యతిరేకంగా మూడు వార్డుల మహిళలు రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అమలాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అమర్‌బాబు మంగళవారం గీత కార్మికులు ఏర్పాటు చేసే మద్యం దుకాణ ప్రదేశాన్ని పరిశీలించారు. నిబంధనలు మేరకు మద్యం దుకాణం ఏర్పాటు చేస్తున్నారా? లేదా అనే అంశాలపై ఆయన ఆరా తీశారు. ఇక్కడి పరిస్థితిని ఆలమూరు ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు, ఎస్ఐ రాంబాబు తోపాటు పలువురు నిర్వాహకులను ఆయన అడిగి తెలుసుకున్నారు.



ముత్యాలమ్మను దర్శించుకున్న ఎంపీపీ నాగమణి

ఘనంగా ముత్యాలమ్మ జాతర

కె.గంగవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి గ్రామ దేవత ముత్యాలమ్మ జాతరను సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మంగళవారం తీర్థం జరిగింది. ఎంపీపీ పంపన నాగమణి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

బీవీసీలో పాలిసెట్ హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థుల కోసం రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటుచేసినట్టు కళాశాల చైర్మన్ బోనం కృష్ణసతీష్ తెలిపారు. ప్రవేశపరీక్ష రాసిన విద్యార్థులు సర్టిఫికెట్ల వెరిఫికేస్, ఆన్‌లైన్ కౌన్సిలింగ్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా అందరికీ అందుబాటులో ఉండేలా పాలిసెట్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే సాంకేతిక విద్యాశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, జిల్లాలోని పాలిసెట్ విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు తెలిపారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

మండపేట ఏప్రిల్, 1(ఆంధ్రజ్యోతి): తమది చేతల ప్రభుత్వమని బటన్ నొక్కుడు ప్రభుత్వం కాదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం పేదరిక నిర్మూలన లక్ష్యంగా పని చేస్తుందన్నారు. సంగం పుంత కాలనీ2లో మంగళవారం ఆయన పింఛన్ల పంపిణీలో పాల్గొని లబ్ధిదారులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, గుత్తుల సత్తిబాబు తదితరులు వున్నారు.

కేశవరంలో వాలీబాల్ పోటీలు

మండపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి):కేశ వరం జిల్లా పరిషత్ హైస్కూల్లో మహి మొబై ల్స్, దాతల సహకారంతో వాలీబాల్ పోటీలను నిర్వహించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ముక్కపాటి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో కూసు రామచంద్రనాయుడు టీం విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో పది టీంలు పాల్గొన్నాయి. విజేత లుగా కె.హేమంత్ టీం రన్నర్‌గా నిలిచింది. అనంతరం జరిగిన బహుమతి ప్రదానంలో ఎంపీపీ ఉండమట్ల వాసు, ఉండమట్ల రామా రావు చేతులు మీదుగా విజేతలకు బహుమతు లను అందజేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీ లకు చెందిన కర్రి తాతారావు, దూలం వెంకన్న బాబు, గంధం నాగసూరిబాబు, యండ్ల రవి, మహి మొబైల్స్ అధినేత పిల్లా శేఖర్, కూసు యేసు, ఉండమట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ విజేత జట్టుతో నేతలు

కుటుంబ సాధికార సారధుల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి



రాఘవన్‌కు పార్టీ సభ్యత్వ కార్డు అందచేస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సారధుల ప్రక్రియ ఈనెల 6లోగా పూర్తి చేయాలని మంత్రి సుభాష్ కోరారు. మంగళవారం రామచంద్రపురంలో పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలో మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. సీఎం చంద్రబాబు కుటుంబ సాధికార సారధుల పేరిట నూతన వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు తెలిసేలా కుటుంబ సాధికార సారధులు వ్యవహరిస్తారన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమావేశంలో ఆయా మండలాల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థినులు



రాయవరంలో టెన్త్ పరీక్షలు ముగియడంతో ఆనందోత్సాహాలతో బయటకు వస్తున్న విద్యార్థినులు



ఆలమూరులో పదో తరగతి పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ముగిసిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): గత నెల 17న ప్రారంభమైన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిసాయి. మండలంలోని అంగర, కపిలేశ్వరపురం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో మండలం నుంచి 8 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 375 మంది విద్యార్థులు, 3 ప్రైవేటు పాఠశాలలకు చెందిన 95 మంది మొత్తం 470 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా ఒక్కరు మినహా మిగిలిన విద్యార్థులంతా హాజరైనట్టు ఎంఈవో కె.తాతారావు తెలిపారు.

రాయవరం, (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. గతనెల 31న జరగాల్సిన సోషల్ పరీక్ష రంజాన్ సందర్భంగా వాయిదా పడటంతో ఆయా పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, చెల్లూరు సర్వారాయ ఉన్నత పాఠశాల, పసలపూడి ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. మండలంలోని 8 ప్రభుత్వ, ఐదు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు రాశారు. పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో పలువురు స్నేహితులకు వీడ్కోలు తెలిపారు.

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): మండలంలో పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బొబ్బా జయశ్రీ జడ్పీ గరల్స్ హైస్కూల్, చెముడులంక జడ్పీ హైస్కూల్‌లో పరీక్షలు నిర్వహించగా ఆయా కేంద్రాల్లో 684 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా దీనిలో ఇద్దరు విద్యార్థులు మాత్రమే హాజరు కాలేదని ఎంఈవో బి.అప్పాజీ తెలిపారు.



ద్రాక్షారామలో రికార్డులు తనిఖీ చేస్తున్న మలేరియా అధికారి

పీహెచ్‌సీలను తనిఖీ చేసిన జిల్లా మలేరియా అధికారి

ద్రాక్షారామ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ పీహెచ్‌సీని మంగళవారం జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు తనిఖీ చేశారు. లేబరేటరీలో జరుగుతున్న పరీక్షల వివరాలు తెలుసుకున్నారు. డెంగ్యూ కేసులు వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ప్రశాంతి, సబ్ యూనిట్ అధికారి సత్యనారాయణ, సీహెచ్‌వో యు.వీరవేణి, ఎంపీహెచ్ఎస్ ఎన్.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర పీహెచ్‌సీని మంగళవారం ఇన్‌చార్జ్ జిల్లా మలేరియా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లేబొరేటరీ ని సందర్శించి వాటి రికార్డులు, రిపోర్ట్‌లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రత్నకుమారి, సబ్‌యూనిట్ ఆఫీసర్ సత్యనారాయణ, హెచ్‌ఈ రామారావు, ల్యాబ్ టెక్నీషియన్ ఆలీ, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గండ్రోతుమెరక ఓఎన్జీసీ బావిలో ప్రెషర్ టెస్టింగ్

అల్లవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలం గండ్రోతువారి మెరకలో ఓఎన్జీసీ బావిలో మంగళవారం ప్రెషర్ టెస్టింగ్ నిర్వహించారు. నాణ్యతతో కూడిన ఉత్పత్తులు సాధించేందుకు ఈఆన్‌షోర్ బావిలో ప్రెషర్ టెస్టింగ్‌లు నిర్వహించారు.



వెదురుపాకలో పింఛన్‌ను పంపిణీ చేస్తున్న దృశ్యం

93శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

రాయవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ ఆయా గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. మండలంలోని 12 గ్రామాల్లో 19 గ్రామ సచివాలయాల పరిధిలో 9వేల 983 మంది వివిధ రకాల పింఛన్‌దారులు ఉన్నారు. సచివాలయ ఉద్యోగులు 9వేల 300 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భర్త చనిపోయిన వితంతువులకు వెంటనే పింఛన్లు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయిన పింఛన్లు మూడు నెలలు కలిపి ఒకేసారి వారికి అందజేశారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం...ఎమ్మెల్యే హామీకి తూట్లు

ఆలమూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్, ఇంజనీరింగ్ అధికారి నిర్లక్ష్యంతో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఇచ్చిన హామీకి తూట్లు పొడిచారు. నిధులు మంజూరు చేసినప్పటికీ నిర్మాణం చేయడంపై శ్రద్ధ వహించకపోవడంతో ఆలమూరు మసీదు రోడ్డు అసంపూర్తిగా నిలిచిపోయింది. రంజాన్ నాటికి పూర్తి చేయాలని ఎమ్మెల్యే బండారు మసీదు రోడ్డుకు రూ.7లక్షలు కేటాయించారు. బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో డిసెంబరులో పనిమొదలు పెట్టి కంకరతో నిర్మించారు. అప్పటి నుంచి బీటీ వేయకపోవడంతో ఈ రోడ్డుపై ప్రయాణం చేయడం నరకంగా మారింది. ముఖ్యంగా ఆలమూరు గ్రామం నుంచి జొన్నాడ వెళ్లడానికి మార్గం ముఖ్యంగా ఈ రోడ్డులో మసీదు ఉండటంతో ఆలమూరు గ్రామం నుంచి మసీదు వరకు బీటీ రోడ్డు మంజూరు చేశారు. ఈ రోడ్డును రంజాన్ నెలనాటికి పూర్తి చేస్తామని అప్పట్లో ఎమ్మెల్యే ముస్లింలకు హామీ ఇచ్చారు. రంజాన్ అయిపోయినప్పటికీ కాంట్రాక్టర్‌తో పాటు ఇంజనీరింగ్ అధికారి ఆ రోడ్డు వైపు చూడలేదు. ముస్లింలు అక్కడకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడారు. ఈవిషయంపై అనేకసార్లు స్థానిక నాయకులు ఫిర్యాదు చేసినప్పటికీ ఇంజనీరింగ్ అధికారి స్పందించకపోవడం పట్ల స్థానిక నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ టీడీపీ నాయకులు ఈదల నల్లబాబు అధికారుల తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి మసీదు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఆయన కోరారు.



ఆలమూరు మసీదు రోడ్డు దుస్థితి